www.prajanaava.in

Telugu Daily

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: **Hyderabad, Rangareddy, Karimnagar** Circulated to: **Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 92 | శుక్రవారం | 13 నవంబర్, 2026



కేఎఫ్‌సీ, డొమినోస్ ఔట్‌లెట్లపై కొరడా

2

సంప్రదాయాల సందడి..
పుష్కర్ జాతర

రాజస్థాన్‌లోని పుష్కర్ పట్టణం మరోసారి సంప్రదాయాలు, సంస్కృతి, పర్యాటకుల సందడితో కళకళలాడుతోంది. ప్రతి ఏటా నిర్వహించే ప్రసిద్ధ పుష్కర్ ఒంటెల జాతర (పుష్కర్ మేళా) అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. శతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన ఈ జాతర స్థానిక సంప్రదాయాలు, భక్తి విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తోంది. కార్తీక పౌర్ణమి సందర్భంగా జరిగే ప్రత్యేక ఆచారాలు ఈ వేడుకలకు మరింత ప్రాధాన్యం తీసుకొస్తాయి. పుష్కర్ జాతరలో ఒంటెలు, ఇతర పశువుల కొనుగోళ్లు, అమ్మకాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. రాజస్థాన్‌తోపాటు ఇతర ప్రాంతాల నుంచి పశుపోషకులు తమ ఒంటెలు, పశువులతో ఇక్కడికి చేరుకుంటారు. ఒంటెల అలంకరణలు, వాటి ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకుంటాయి. పశువుల వ్యాపారంతోపాటు గ్రామీణ జీవనశైలి, రాజస్థానీ సంస్కృతిని దగ్గరగా చూసే అవకాశం ఈ జాతర కల్పిస్తుంది. జాతరలో జానపద సంగీతం, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. స్థానిక కళాకారుల ప్రదర్శనలు, సంప్రదాయ వేడుకలు పుష్కర్ మేళాకు ప్రత్యేక గుర్తింపునిస్తున్నాయి. భక్తులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివస్తుండటంతో పట్టణమంతా పండుగ వాతావరణం నెలకొంటుంది. సంప్రదాయాలు, పశుసంపద, జానపద కళల సమ్మేళనంగా పుష్కర్ జాతర అంతర్జాతీయంగా గుర్తింపు పొందింది.

– అజ్మేర్



జూన్ నాటికి టిమ్స్

డిసెంబరులోగా అందుబాటులోకి ఉస్మానియా నూతన ఆసుపత్రి

- వైద్యులు, సిబ్బంది నియామకాలు.. పరికరాల కొనుగోళ్లు ఏకకాలంలో పూర్తి చేయాలి
- ఆరోగ్య రంగానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాం: సీఎం రేవంత్‌రెడ్డి



ప్రజానావ, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేసే దిశగా కీలక నిర్ణయాలు తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. అల్వాల్, ఎల్‌బీనగర్ టిమ్స్ ఆసుపత్రులు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నిమ్స్ విస్తరణ పనులను వచ్చే ఏడాది జూన్ రెండో తేదీ నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణాన్ని వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. గురువారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి ఆ శాఖపై సమీక్ష నిర్వహించారు. వైద్యారోగ్యశాఖకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని సీఎం తెలిపారు. నిమ్స్ విస్తరణ, కొత్త ఆసుపత్రుల నిర్మాణం, అవసరమైన వైద్య పరికరాల కొనుగోలు, వైద్యులు, సిబ్బంది నియామకాలు ఒకేసారి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఒక్కో కుటుంబానికి అందించే చికిత్స కవరేజీని రూ.ఐదు లక్షల నుంచి రూ.పది లక్షలకు పెంచిన విషయాన్ని గుర్తుచేశారు.

టిమ్స్‌లకు ఏకీకృత నియామక విధానం

మూడేళ్లలో తొమ్మిది వైద్య కళాశాలలు, పదహారు నర్సింగ్ కళాశాలలు, ఇరవై ఎనిమిది పారామెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసినట్లు సీఎం వెల్లడించారు. సనత్‌నగర్, అల్వాల్, ఎల్‌బీనగర్ టిమ్స్‌లలో వైద్యులు, ఇతర సిబ్బంది నియామకాలకు ఏకీకృత విధానం అమలు చేయాలని సూచించారు. వైద్యసేవల అవసరాలకు అనుగుణంగా ఈ మూడు ఆసుపత్రుల మధ్య వైద్యులు, సిబ్బందిని బదిలీ చేసే వెసులుబాటు ఉండాలన్నారు. ఆసుపత్రుల నిర్వహణ, పారిశుద్ధ్య పనుల కోసం సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ విధానంలో నియమించాలని ఆదేశించారు. టిమ్స్‌ల పర్యవేక్షణకు గ్రూప్–1 అధికారులను, పారిశుద్ధ్య సిబ్బంది పనితీరును పర్యవేక్షించేందుకు విశ్రాంత సైనిక అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. నిమ్స్‌లో పడకలు అందుబాటులో లేకపోయినా, శస్త్రచికిత్సలకు ఆలస్యమైనా రోగులకు సనత్‌నగర్ టిమ్స్‌లో వైద్యసేవలు అందించాలని తరువాయి 2లో..

హైదరాబాద్‌లో
పీఆర్టీ వ్యవస్థ

- ట్రాఫిక్ రద్దీ, ప్రయాణ సమయం తగ్గించేందుకు సీఎం రేవంత్ కీలక నిర్ణయం
- కేపీహెచ్‌బీ నుంచి దుర్గం చెరువు, మైండ్‌స్పేస్ మీదుగా బయోడైవర్సిటీ వరకు తొలి మార్గం

2

- ఏడాదిలోగా పనులు పూర్తిచేయాలని ఆదేశం



ఎన్విడియా సీఈఓగా
జెన్సన్ రాజీనామా

- తక్షణమే అమల్లోకి.. తాత్కాలిక సీఈఓగా కోలెట్ క్రెస్
- శాశ్వత వారసుడి కోసం అన్వేషణ
- అంతర్గత, బాహ్య అభ్యర్థుల పరిశీలనకు బోర్డు నిర్ణయం
- విదేశీ నిధూ వ్యవహారంపై స్వతంత్ర విచారణ

2

న్యూయార్క్‌లో కుప్పకూలిన భవనం

- ఎనిమిది మంది మృతి.. మరో 17మందికి గాయాలు

6

పోలీస్ శాఖలో
భారీ ప్రక్షాళన



- ఒకేసారి 21 మంది ఐపీఎస్ అధికారుల బదిలీ
- హైదరాబాద్ కొత్త పోలీస్ కమిషనర్‌గా మహేశ్ భగవత్
- ఫైర్ సర్వీసెస్ డీజీగా వీసీ సజ్జనార్..
- శాంతిభద్రతల ఏడీజీపీగా అకున్ సబర్వాల్
- ఏసీబీ, సీఐడీ, మహిళా భద్రత, ట్రాఫిక్ విభాగాల్లోనూ కీలక మార్పులు

2

నేటి నుంచి భారత్ సమ్మిట్

- హైదరాబాద్‌కు చేరుకున్న 70 దేశాల ప్రతినిధులు
- ప్రియాంక గాంధీ ప్రసంగం.. ఏఐ, వాతావరణ మార్పులపై చర్చలు
- ముగింపు సభకు రానున్న రాహుల్ గాంధీ

2

జూన్ నాటికి టిమ్స్

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. ఈ విషయంలో వైద్యా రోగ్య శాఖ కార్యదర్శి, నిమ్స్, టిమ్స్ డైరెక్టర్లు నిరంత రం సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. టి మ్స్‌లలో వైద్యుల నియామకాలు పూర్తయ్యే వరకు అవసరమైన వైద్యులను బయటి నుంచి నియమించు కోవాలని, ఇందుకు కావాల్సిన నిధులను వెంటనే విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

డయాలిసిస్ కేంద్రాల పనులు వేగవంతం చేయాలి

అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా పదహారు డ యాలిసిస్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సీఎం తెలిపారు. నిర్మాణంలో ఉన్న మరో డెబ్బై తొమ్మిది కేం ద్రాల పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందు బాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. బోధనాసు పత్రులు, నర్సింగ్ కళాశాలల నిర్మాణాలు, వైద్య పరి కరాల కొనుగోళ్లు ఒకేసారి పూర్తయ్యేలా సమగ్ర కా ర్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది హాజరును బయోమె ట్రిక్ విధానంలో నమోదు చేసేలా చర్యలు తీసుకోవా లని సూచించారు. రాష్ట్ర బడ్జెట్‌లో గతంలో ఆరోగ్య రంగానికి సగటున 3.9 శాతం నిధులు కేటాయించ గా, గత మూడేళ్లుగా సగటున 4.8 శాతం కేటాయిస్తు న్నామని రేవంత్‌రెడ్డి వివరించారు. ఈ శాఖలో మూ డేళ్లలో 13,401 నియామకాలు పూర్తిచేశామని, మరో 5,640 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు.

పెరిగిన రోగుల సంఖ్య

గత మూడేళ్లలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడకల సం ఖ్యను 30వేల నుంచి 38వేలకు పెంచిన ట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రు ల్లో ఏటా ఔట్‌పేషెంట్ల సంఖ్య ఏడు కోట్ల నుంచి తొ మ్మిది కోట్లకు, ఇన్‌పేషెంట్ల సంఖ్య 23 లక్షల నుంచి 24.30 లక్షలకు పెరిగినట్లు తెలిపారు. వైద్యసేవలు పొందుతున్న వారి సంఖ్య పెరగడంపై సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమీక్షలో ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, వైద్యారోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా, టీజీఎంఎస్ఐడీసీ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, వైద్యారోగ్య శాఖ కమిషనర్ ముషారఫ్ అలీ ఫరూఖీ, ఆర్అండ్‌బీ కార్యదర్శి ఇలంబర్తి, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్, టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో పీఆర్టీ వ్యవస్థ

- ట్రాఫిక్ రద్దీ, ప్రయాణ సమయం తగ్గించేందుకు సీఎం రేవంత్ కీలక నిర్ణయం
- కేపీహెచ్‌బీ నుంచి దుర్గం చెరువు, మైండ్‌స్పేస్ మీదుగా బయోడైవర్సిటీ వరకు తొలి మార్గం
- డిసెంబరులోగా టెండర్లు.. ఏడాదిలోగా పనులు పూర్తి చేయాలని ఆదేశం
- మరో రెండు మార్గాల్లోనూ పీఆర్‌టీ ఏర్పాటుకు ప్రతిపాదనలు

ప్రజానావ, హైదరాబాద్: నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించి, ప్రయాణ సమయాన్ని ఆదా చేయడంతోపాటు కాలుష్య నియంత్రణకు పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ (పీఆర్‌టీ) వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కోర్ అర్బన్ ఏరియా పరిధిలోని కీలక ప్రాంతాలను అనుసంధానిస్తూ ఈ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో పీఆర్‌టీ విధానంపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు.

ఐటీ కారిడార్‌లో తొలి మార్గం

నగరంలో అత్యంత రద్దీగా ఉండే కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ నుంచి దుర్గం చెరువు, రహేజా మైండ్‌స్పేస్ మీదుగా బయోడైవర్సిటీ మెట్రో స్టేషన్ వరకు తొలి పీఆర్‌టీ మార్గాన్ని ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను డిసెంబరు నాటికి పూర్తి చేయాలని, ఏడాది కాలంలోనే వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని ఐకియా సమీపంలో బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయాన్ని నిర్మించి, అందులో పీఆర్‌టీ డిపోను ఏర్పాటు చేయాలని సూచించారు. నగరంలోని ఇతర రద్దీ ప్రాంతాల్లోనూ పీఆర్‌టీ వ్యవస్థను విస్తరించాలని సీఎం సూచించారు. ఎల్బీ స్టేడియం నుంచి అంబేద్కర్ విగ్రహం, ఇందిరా పార్కు, లోయర్ ట్యాంక్ బండ్ మీదుగా రాణిగంజ్ బస్ స్టాండ్ వరకు మరో మార్గాన్ని నిర్మించాలని పేర్కొన్నారు. అలాగే అసెంబ్లీ మెట్రో స్టేషన్ నుంచి రవీంద్రభారతి, సచివాలయం, ఐమాక్స్ మీదుగా బేగంపేటను కలుపుతూ ఇంకో మార్గాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. నెక్లెస్ రోడ్డు పరిసరాల్లో బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయాన్ని నిర్మించి, అందులో పీఆర్‌టీ డిపో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మార్గాలు అందుబాటులోకి వస్తే నగరంలోని ప్రధాన వాణిజ్య, ఐటీ, పరిపాలనా ప్రాంతాల మధ్య ప్రయాణం సులభతరం కానుంది. ట్రాఫిక్ సమస్యకు కొంతవరకు పరిష్కారం లభించడంతో పాటు వాహన కాలుష్యం తగ్గే అవకాశం ఉంది.

ప్రజాప్రతినిధుల కోర్టుకు సీఎం

- నాగార్జునసాగర్ ఉపఎన్నిక నాటి కేసులో హాజరు
- కోవిడ్ నిబంధనల ఉల్లంఘన ఆరోపణలపై విచారణ
- సెక్షన్ 313 కింద వాంగ్మూలం నమోదు

ప్రజానావ, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానానికి హాజరయ్యారు. గతంలో ఆయనపై నమోదైన కేసుల విచారణలో భాగంగా న్యాయస్థానం ఎదుట తన వాంగ్మూలాన్ని నమోదు చేశారు. 2021లో నాగార్జునసాగర్ ఉపఎన్నిక ప్రచార సమయంలో కొవిడ్ నిబంధనలు ఉల్లంఘించారనే ఆరోపణలతో నమోదైన కేసులో ఈ విచారణ జరిగింది.

ఉప ఎన్నిక ప్రచారంలో కేసు

2021 ఏప్రిల్ 11న నల్గొండ జిల్లా పెద్దవూర మండలం చలకుర్తి గ్రామంలో నాగార్జునసాగర్ ఉపఎన్నిక ప్రచారంలో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. అప్పట్లో ఆయన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఉన్నారు. ప్రచార సమయంలో మాస్కు ధరించకుండా, కొవిడ్ నిబంధనలు పాటించలేదనే ఆరోపణలతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 313 ప్రకారం న్యాయస్థానం ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసింది. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి, కొవిడ్ నిబంధనల ఉల్లంఘన ఆరోపణలపై రేవంత్‌రెడ్డిపై రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పలు కేసులు నమోదయ్యాయి. వీటిలో భాగంగా 2026 ఫిబ్రవరి 28న కూడా ఏడు కేసుల విచారణ నిమిత్తం ఆయన ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టుకు హాజర య్యారు. ఈ కేసుల్లో 2019 హుజూర్‌నగర్ ఉపఎన్నిక ప్రచారం, 2021లో కొవిడ్ సమయంలో నిర్వహించిన బహిరంగ సభలకు సంబంధించిన ఆరోపణలు ఉన్నాయి. 2019 హుజూర్‌నగర్ ఉపఎన్నిక ప్రచార సమయంలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా సుమారు 40 వాహనాలు, డీజే సౌండ్ సిస్టమ్‌తో ర్యాలీ నిర్వహించారనే ఆరోపణలపై రేవంత్‌రెడ్డి, అప్పటి ఎంపీ నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై కేసులు నమోదయ్యాయి. గరిడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఓ కేసులో ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మొదటి నిందితుడిగా, రేవంత్‌రెడ్డిని రెండో నిందితుడిగా పేర్కొన్నారు. 2019 అక్టోబర్ 19న ఎన్నికల అధికారుల ముందస్తు అనుమతి లేకుండా పోనుగోడు మండలంలో ప్రచార సభ నిర్వహించారనే ఆరోపణలతో పోలీసులు ఐపీసీ సెక్షన్ 188 కింద కేసు నమోదు చేశారు. అనంతరం హైదరాబాద్‌లోని ఎక్సైజ్ కేసుల ప్రిన్సిపల్ స్పెషల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు, నిబంధనలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించినట్లు నిరూపించే బలమైన ఆధారాలు చార్జిషీట్‌లో లేవని పేర్కొంటూ కేసును కొట్టివేసింది. తాజాగా నాగార్జునసాగర్ ఉపఎన్నిక నాటి కొవిడ్ నిబంధనల ఉల్లంఘన కేసు విచారణలో భాగంగా సీఎం న్యాయస్థానానికి హాజరయ్యారు.

కేఎఫ్‌సీ, డొమినోస్ ఔట్‌లెట్లపై కొరడా

- హైదరాబాద్‌లో తొమ్మిది శాఖల లైసెన్సులు తక్షణమే సస్పెండ్
- వంటగదుల్లో బొద్దింకలు, ఎలుకల వ్యర్థాలు.. గడువు ముగిసిన ఆహార పదార్థాలు
- వాడిన నూనె శుద్ధికి రసాయనాల వినియోగం.. 52 కిలోల పదార్థం స్వాధీనం
- 26 కేంద్రాల్లో ఏకకాలంలో తనిఖీలు.. 20 ఆహార నమూనాలు సేకరణ

ప్రజానావ, హైదరాబాద్: నగరంలోని ప్రముఖ ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో ఆహార భద్రతా ప్రమాణాల ఉల్లంఘన తీవ్రంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అపరిశుభ్రత, నాణ్యతా లోపాల నేపథ్యంలో ఏడు కేఎఫ్‌సీ, రెండు డొమినోస్ శాఖల ఆహార భద్రతా లైసెన్సులను తక్షణమే సస్పెండ్ చేశారు. తెలంగాణ స్టేట్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టీజీ సేఫ్) అధికారులు పోలీసులతో కలిసి నగరవ్యాప్తంగా ఈ రెండు సంస్థలకు చెందిన 26 ఔట్‌లెట్లలో తనిఖీలు నిర్వహించారు. ఇందుకోసం 13 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. తనిఖీల్లో పలు కేంద్రాల వంటగదులు, ఆహార నిల్వ ప్రాంతాల్లో బొద్దింకలు, ఈగలు ఉన్నట్లు గుర్తించారు. ఎలుకల వ్యర్థాలు, గడువు ముగిసిన ఆహార పదార్థాలు, గోడలపై బూజు, జిడ్డు పట్టిన వంట సామగ్రి, పరికరాలు, దుర్వాసన వంటి తీవ్ర లోపాలను అధికారులు గుర్తించారు. ఆహార పదార్థాల తయారీ, నిల్వలో కనీస పరిశుభ్రతా ప్రమాణాలు పాటించడం లేదని నిర్ధారించారు. వాడిన వంట నూనెను తిరిగి వినియోగించేందుకు శుద్ధి చేసే క్రమంలో సింథటిక్ మెగ్నీషియం సిలికేట్ అనే రసాయనాన్ని అక్రమంగా ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. తనిఖీల్లో సుమారు 52 కిలోల రసాయనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆహార పదార్థాల్లో కల్తీ జరిగిందనే అనుమానంతో 20 నమూనాలను సేకరించి ప్రయోగశాలలకు పంపించారు.

ఆయా ప్రాంతాల్లోని శాఖలకు మూసివేత ఆదేశాలు

లైసెన్సులు సస్పెండ్ చేసిన ఏడు కేఎఫ్‌సీ శాఖల్లో మదీనగూడ–మియాపూర్, సింధి కాలనీ, చార్మినార్, మూసారాంబాగ్, బంజారాహిల్స్, హైటెక్ సిటీలోని శిల్పకళా వేదిక, మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ శాఖలు ఉన్నాయి. అలాగే కొండాపూర్‌లోని శరత్ సిటీ మాల్, మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్‌లో ఉన్న రెండు డొమినోస్ శాఖల లైసెన్సులను కూడా సస్పెండ్ చేశారు. ఈ తొమ్మిది కేంద్రాలను తక్షణమే మూసివేయాలని అధికారులు ఆదేశించారు. లైసెన్సులు పునరుద్ధరించే వరకు స్విగ్గీ, జొమాటో వంటి ఆన్‌లైన్ ఆహార సరఫరా వేదికల నుంచి ఆయా శాఖల వివరాలను తొలగించాలని కోరనున్నారు.

మరికొన్ని కేంద్రాలకూ నోటీసులు

తనిఖీల్లో లోపాలు గుర్తించిన మరో ఎనిమిది శాఖలకు మెరుగుదల నోటీసులు జారీ చేయనున్నారు. వీటిలో నాలుగు కేఎఫ్‌సీ, నాలుగు డొమినోస్ కేంద్రాలు ఉన్నాయి. తీవ్రమైన ఉల్లంఘనలకు పాల్పడిన మరో ఐదు శాఖలకు షోకాజ్ నోటీసులు పంపించి, జరిమానాలతో పాటు తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

నేటి నుంచి భారత్ సమ్మిట్



ప్రజానావ, హైదరాబాద్: ప్రపంచ ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, నూతన ప్రపంచ క్రమంపై చర్చించేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'భారత్ సమ్మిట్ –తెలంగాణ రైజింగ్' సదస్సులో కీలక ఘట్టానికి నేడు తెరలేవనుంది. భారత స్వాతంత్ర్య ఎనభైవ వార్షికోత్సవం, తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నూట ముప్పై ఏడో జయంతిని పురస్కరించుకుని 'కొత్త ప్రపంచ నిర్మాణం' నినాదంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఇందులో పాల్గొనేందుకు సుమారు డెబ్బై దేశాల నుంచి వెయ్యి మందికి పైగా ప్రతినిధులు హైదరాబాద్‌కు చేరుకున్నారు. గురువారం నగరానికి వచ్చిన విదేశీ ప్రతినిధులకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు స్వాగతం పలికారు. ప్రతినిధుల క్షేత్రస్థాయి పర్యటనలు, స్వాగత విందుతో సదస్సు సందడి ప్రారంభమైంది. హెచ్ఐసీసీ, హైటెక్స్ వేదికలుగా నేడు, రేపు కీలక చర్చలు జరగనున్నాయి.

ప్రియాంక ప్రసంగం..

శుక్రవారం ఉదయం పదిన్నర గంటలకు 'కొత్త ప్రపంచ క్రమం.. భారత్ దృక్కోణం' అంశంపై జరిగే ప్లీనరీ సమావేశంలో ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ ప్రసంగించనున్నారు. ఉదయం పదకొండున్నర గంటలకు కాంగ్రెస్ పార్టీ నూట నలభై ఏళ్ల ప్రస్థానం, హక్కుల ఆధారిత చట్టాలపై ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనను ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం జరిగే అంతర్జాతీయ చర్చల్లో కృత్రిమ మేధ, క్లైడ్ పెట్టుబడుల విధానం, వాతావరణ మార్పులు, బహుళపక్ష సంస్థల సంస్కరణలు, లింగ సమానత్వం వంటి అంశాలు ప్రస్తావనకు రానున్నాయి. ప్రముఖ ఆర్థికవేత్త థామస్ పికెట్టి ఆన్‌లైన్‌లో పాల్గొననుండగా, జయతి ఘోష్, నెదర్లాండ్స్ మాజీ మంత్రి బెర్ట్ కోయెండర్స్, ఎంపీ రేణుకా చౌదరి తదితరులు తమ అభిప్రాయాలను వెల్లడించనున్నారు.

తెలంగాణ అభివృద్ధిపై ప్రత్యేక చర్చలు

హైటెక్స్ వేదికగా 'తెలంగాణ రైజింగ్' పేరుతో జాతీయ స్థాయి చర్చాగోష్ఠులు నిర్వహించనున్నారు. ఫ్యూచర్ సిటీ, ఆర్థిక న్యాయం, సామాజిక న్యాయం, సంక్షేమ పథకాలపై మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వివేక్ వెంకటస్వామి, జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి, ప్రొఫెసర్ కంచ ఐలయ్య తదితరులు చర్చించనున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్న పారిశ్రామికవేత్తలతో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. అనంతరం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబులతో పారిశ్రామికవేత్తల ముఖాముఖి సమావేశం జరగనుంది.

ముగింపు సభకు రాహుల్ గాంధీ

సదస్సు ముగింపు వేడుకల్లో పాల్గొనేందుకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు హెచ్ఐసీసీలో జరిగే 'ప్రపంచ న్యాయం సాధన' ముగింపు సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలతో కలిసి రాహుల్ గాంధీ కీలక ప్రసంగం చేయనున్నారు.

ఎన్విడియా సీఈఓగా జెన్సన్ రాజీనామా

న్యూఢిల్లీ: ప్రపంచ ప్రముఖ చిప్‌ల తయారీ సంస్థ ఎన్విడియాలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సంస్థ సహ వ్యవస్థాపకుడు జెన్సన్ హువాంగ్ అధ్యక్షుడు, సీఈఓ, బోర్డు సభ్య పదవులకు తక్షణమే రాజీనామా చేశారు. ఈ విషయాన్ని సంస్థ గురువారం ప్రకటించింది. కొత్త సీఈఓను నియమించే వరకు ప్రస్తుత చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) కొలెట్ క్రెస్‌ను తాత్కాలిక సీఈఓగా నియమించింది. శాశ్వత వారసుడి ఎంపిక కోసం సంస్థ అంతర్గత, బాహ్య అభ్యర్థులను పరిశీలించనుంది. సినాప్సిస్ మాజీ సీఈఓ, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ హార్వే సి. జోన్స్‌ను ఎన్విడియా బోర్డు తొలి చైర్మన్‌గా నియమించింది. కొలెట్ క్రెస్‌కు సంస్థ వ్యాపారం, వినియోగదారులు, కార్యకలాపాలు, ఆర్థిక పరిస్థితులపై మంచి అవగాహన ఉందని జోన్స్ పేర్కొన్నారు. గత 33 ఏళ్లుగా జెన్సన్ హువాంగ్ నిర్మించిన పునాదిపై సంస్థను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని క్రెస్ తెలిపారు. శాశ్వత సీఈఓ నియామకం జరిగే వరకు ఆమె సీఎఫ్ఓ బాధ్యతలనూ కొనసాగించనున్నారు.

వివాదాల నేపథ్యంలో తొలగింపు?

హువాంగ్ రాజీనామాకు కారణాన్ని సంస్థ అధికారిక ప్రకటనలో వెల్లడించలేదు. అయితే చైనా వ్యాపారవేత్తతో ఆయనకు వివాహేతర సంబంధం ఉందని, ఆమె బీజింగ్ తరఫున గూఢచర్యానికి పాల్పడుతున్నట్లు అమెరికా అధికారులు అనుమానిస్తున్నారని ఇటీవల మీడియా కథనాలు వెలువడ్డాయి. ఈ వ్యవహారంలో హువాంగ్‌ను విదేశీ నిఘా వర్గాలు లక్ష్యంగా చేసుకున్నాయన్న ఆరోపణలపై ఎన్విడియా స్వతంత్ర విచారణ ప్రారంభించింది. నవంబర్ 8న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ వ్యవహారంపై ఎఫ్‌బీఐ విచారణ జరుపుతోందని ప్రకటించారు. కొలెట్ క్రెస్ 2013 సెప్టెంబర్‌లో ఎన్విడియాలో చేరారు. అంతకుముందు సిస్కో, మైక్రోసాఫ్ట్ సహా పలు టెక్నాలజీ సంస్థల్లో దాదాపు 25 ఏళ్లపాటు ఆర్థిక విభాగాల్లో పనిచేశారు. కాగా, 2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మూడో త్రైమాసిక ఫలితాలను ఈ నెల 17న ప్రకటించనున్నట్లు ఎన్విడియా వెల్లడించింది. సీఈఓ మార్పు నేపథ్యంలో ఈ ఫలితాలపై మార్కెట్ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



పరీక్షల పర్యవేక్షణకు మాజీ సైనికులు

- కీలక సంస్కరణలు చేసిన ఎన్‌టీఏ
- పేపర్ లీకేజీలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చర్యలు
- రిటైర్డ్ సైనిక, పారామిలిటరీ సిబ్బందితో పరిశీలకుల నియామకం

న్యూఢిల్లీ: ప్రశ్నపత్రాల లీకేజీలు, పరీక్షల నిర్వహణలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) కొత్త సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. మాజీ సైనికులు, పారామిలిటరీ సిబ్బంది, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విశ్రాంత అధికారులు, ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లతో శాశ్వత పరిశీలకుల జాబితాను రూపొందించనుంది. ప్రతి పరీక్ష కేంద్రంలో స్వతంత్ర పరిశీలకుడిని నియమించి, పరీక్షల నిర్వహణ తీరుపై నేరుగా ఎన్‌టీఏకు నివేదిక అందించేలా చర్యలు చేపట్టనుంది. విదేశీ కేంద్రాల్లోనూ భారతీయులు, దౌత్య కార్యాలయాల అధికారులకు ఈ బాధ్యతలు అప్పగించే అవకాశముంది. మరోవైపు కొత్త పరీక్ష కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానించింది. కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు (సీబీటీ) కనీసం 285 కంప్యూటర్లు, నాలుగు ప్రత్యేక ల్యాబ్‌లు ఉండాలి. పెన్ అండ్ పేపర్ పరీక్షలకు (పీపీటీ) 250 మంది కూర్చునే సామర్థ్యం, ఆరు పరీక్ష హాళ్లు తప్పనిసరి. ఈ ఏడాది నీట్–యూజీ ప్రశ్నపత్రం లీకేజీ నేపథ్యంలో పరీక్షా వ్యవస్థలో సంస్కరణల కోసం నందన్ నీలేకని నేతృత్వంలో ఉన్నతస్థాయి బృందాన్ని ప్రధాని మోదీ ప్రకటించారు. అయితే, ఆ బృందం ఇంకా నివేదిక సమర్పించలేదు.


విమర్శకుడికి మోదీ దీపావళి శుభాకాంక్షలు

- పిట్రోడాను 'సామ్ భాయ్' అంటూ పలకరించిన ప్రధాని
- నెటిజన్ అభ్యర్థనకూ ప్రధాని తక్షణ స్పందన

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీని, బీజేపీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించే కాంగ్రెస్ నేత, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడు సామ్ పిట్రోడాకు మోదీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల మోదీని తన 'గుజరాతీ మిత్రుడు'గా అభివర్ణిస్తూ, వ్యక్తిగతంగా ఆయనపై ఎలాంటి వ్యతిరేకత లేదని పిట్రోడా పేర్కొన్న నేపథ్యంలో ప్రధాని స్పందించడం ఆసక్తికరంగా మారింది. గురువారం ఎక్స్ వేదికగా 'సామ్ భాయ్, అంజనా బెన్‌లకు దీపావళి, నూతన సంవత్సర శుభాకాంక్షలు. రాబోయే ఏడాది సంతోషంగా, ఆరోగ్యంగా సాగాలని ఆకాంక్షిస్తున్నా. జై జగన్నాథ్' అని మోదీ పేర్కొన్నారు. గతంలో పలుమార్లు మోదీని కలిసినప్పుడు ఆయన ఎంతో ఆప్యాయంగా వ్యవహరించారని పిట్రోడా వెల్లడించారు. గుజరాతీ నాయకుడిగా, మిత్రుడిగా, శ్రేయోభిలాషిగా మోదీపై తనకు ఎలాంటి వ్యతిరేకత లేదని, ఆయన నివాసానికి కూడా పలుమార్లు వెళ్లానని ఓ వార్తా సంస్థకు తెలిపారు. మోదీ పిట్రోడాకు శుభాకాంక్షలు తెలపడంపై మిహిర్ ఝా అనే నెటిజన్ స్పందిస్తూ.. 'సామ్ పిట్రోడాకు చెప్పినట్లే మాకూ దీపావళి శుభాకాంక్షలు చెప్పండి' అని కోరారు. దీనికి వెంటనే స్పందించిన ప్రధాని.. 'మిహిర్ భాయ్.. మీకూ దీపావళి శుభాకాంక్షలు. రాబోయే ఏడాది ఆనందంగా సాగాలి' అని బదులిచ్చారు. దీంతో మిహిర్ ఝా ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు.

పదేళ్లకే స్కూబా డైవింగ్‌లో ప్రపంచ రికార్డులు

- ప్రపంచంలోనే అత్యంత పిన్న వయస్కురాలైన అర్హత కలిగిన స్కూబా డైవర్‌గా గుర్తింపు



ముంబై: మహారాష్ట్రలోని బుల్దానాకు చెందిన 10 ఏళ్ల ఇరా ఆదిత్య రౌత్ స్కూబా డైవింగ్‌లో ఒకే రోజులో ఆరు ప్రపంచ రికార్డులు సాధించి అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. అండమాన్ నికోబార్‌లోని షహీద్ ద్వీపంలో ఈ రికార్డులను నెలకొల్పింది. ప్రపంచంలోనే అత్యంత పిన్న వయస్కురాలైన అర్హత కలిగిన స్కూబా డైవర్‌గా గుర్తింపు పొందింది. నీటి అడుగున అత్యధిక హస్త సంకేతాలు చూప డం, డైవింగ్ పరికరాలను గుర్తించడం, అత్యధిక దూరం ప్రయాణించడం, సముద్ర జీవజాతులను గుర్తించడం వంటి విభాగాల్లో ఇరా రికార్డులు సాధించింది. స్కూబా స్కూల్స్ ఇంటర్నేషనల్ ఆమె అర్హతలను ధ్రువీకరించగా, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ న్యాయనిర్ణేతలు ఆరు రికార్డులను నిర్ధారించారు. ప్రస్తుతం కర్ణాటకలోని కార్వార్ నావల్ చిల్డ్రన్స్ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్న ఇరా తల్లిదండ్రులు కమాండర్ ఆదిత్య రౌత్, కమాండర్ స్నేహ బుడకోటి భారత నావికాదళంలో పనిచేస్తున్నారు.

పోలీస్ శాఖలో భారీ ప్రక్షాళన

- ఒకేసారి 21 మంది ఐపీఎస్ అధికారుల బదిలీ
- హైదరాబాద్ కొత్త పోలీస్ కమిషనర్‌గా మహేశ్ భగవత్
- ఫైర్ సర్వీసెస్ డీజీగా వీసీ సజ్జనార్.. శాంతిభద్రతల ఏడీజీపీగా అకున్ సబర్వాల్
- ఏసీబీ, సీఐడీ, మహిళా భద్రత, ట్రాఫిక్ విభాగాల్లో కీలక మార్పులు



ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణ పోలీస్ శాఖలో ప్రభుత్వం భారీ స్థాయిలో బదిలీలు చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 21మంది సీనియర్ ఐపీఎస్ అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేశారు. శాంతిభద్రతలు, అవినీతి నిరోధక శాఖ, నేర పరిశోధన విభాగం, మహిళా భద్రత, ట్రాఫిక్ తదితర విభాగాల్లో కీలక మార్పులు చేశారు. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా ఇప్పటివరకు శాంతిభద్రతల విభాగం డీజీపీగా ఉన్న మహేశ్ మురళీధర్ భగవత్‌ను నియమించారు. ప్రస్తుత కమిషనర్ వీసీ సజ్జనార్‌ను తెలంగాణ అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర సేవలు, పౌర రక్షణ విభాగం డీజీగా బదిలీ చేశారు. అదనంగా ప్రత్యేక రక్షణ దళం డీజీ బాధ్యతలు కూడా అప్పగించారు. రాష్ట్ర శాంతిభద్రతల అదనపు డీజీపీగా అకున్ సబర్వాల్‌ను నియమించడంతోపాటు సమన్వయం, సాంకేతిక సేవల విభాగాల బాధ్యతలను కేటాయించారు. మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా విభాగాల డీజీపీగా డాక్టర్ సౌమ్య మిశ్రాను నియమించారు. సంస్థాగత వ్యవహారాలు, న్యాయ విభాగం అదనపు డీజీపీ బాధ్యతలను కూడా ఆమెకు అప్పగించారు. స్వాతి లక్రాను జైళ్ల శాఖ డీజీగా నియమించి, హోంగార్డుల విభాగం బాధ్యతలు అదనంగా ఇచ్చారు. చారు సిన్హాకు అవినీతి నిరోధక శాఖ డీజీగా, నేర పరిశోధన విభాగం డీజీపీగా బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు ఈ బాధ్యతల్లో ఉన్న అధికారులకు ఇతర పోస్టింగులు కేటాయించారు. డాక్టర్ అనిల్‌కుమార్‌ను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు.

నాగిరెడ్డికి పౌర సరఫరాల శాఖ

వై. నాగిరెడ్డికి పౌర సరఫరాల శాఖ కమిషనర్, ఎక్స్ అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీ బాధ్యతలు అప్పగించారు. న్యాయ కొలతల శాఖ బాధ్యతలను కూడా ఆయనకే కేటాయించారు. విక్రమ్ సింగ్ మాన్‌కు గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల డీజీపీ (ఆపరేషన్స్), పోలీస్ హౌసింగ్ విభాగం బాధ్యతలు ఇచ్చారు. ఎం. స్టీఫెన్ రవీంద్రను తెలంగాణ రాష్ట్ర మల్టీ జోన్ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా నియమించారు. శిక్షణ విభాగం అదనపు డీజీపీగా సంజయ్‌కుమార్ జైన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎస్. చంద్రశేఖర్‌రెడ్డిని అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్‌గా నియమించారు. కార్తికేయకు మల్టీ జోన్–ఒకటి ఐజీతోపాటు సమీకృత కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ డైరెక్టర్ బాధ్యతలు ఇచ్చారు. కె. రమేష్ నాయుడును రైల్వే విభాగం ఐజీగా నియమించారు. డి. జోయల్ డేవిస్‌ను రహదారి భద్రత, ట్రాఫిక్ విభాగం జాయింట్ డైరెక్టర్‌గా నియమించడంతో పాటు హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. జి. చందన దీప్తికి జోగులాంబ, గద్వాల పరిధిలోని ఏడో జోన్ డీఐజీ బాధ్యతలు అదనంగా ఇచ్చారు. ఆర్. భాస్కరన్‌ను ఇంటెలిజెన్స్ డీఐజీగా నియమించారు. కె. నారాయణ నాయక్‌కు బాసర పరిధిలోని రెండో జోన్ డీఐజీగా, ఎల్.ఎస్. చౌహాన్‌కు సమన్వయ విభాగం డీఐజీగా నియమించి, ఆరో జోన్ డీఐజీ బాధ్యతలు అదనంగా అప్పగించారు. శ్రీబాలా దేవిని తెలంగాణ రాష్ట్ర మల్టీ జోన్ పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ (పరిపాలన)గా నియమించగా, వి. అరవింద్‌బాబుకు హైదరాబాద్ నగర డీసీపీ (ఎస్ఎం, ఐటీ) బాధ్యతలు అప్పగించారు. తాజా బదిలీలతో పోలీస్ శాఖలోని కీలక విభాగాల నాయకత్వంలో మార్పులు చోటుచేసుకున్నాయి.



ప్రారంభోత్సవానికి ముందు బెంగళూరులోని పింక్ లైన్ మెట్రో రైలును గురువారం ట్రయల్ రన్ నిర్వహిస్తున్న దృశ్యం. కలేన అగ్రహార నుంచి తావరెకెరె వరకు ఈ రైలు నడిచింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ మార్గాన్ని శుక్రవారంప్రారంభించనున్నారు.

పింక్ లైన్ మెట్రోకు ట్రయల్ రన్

- కలేన అగ్రహార నుంచి తావరెకెరె వరకు 7.5 కిలోమీటర్ల మార్గం
- ఆరు స్టేషన్లతో అందుబాటులోకి మరో మెట్రో కారిడార్
- జయదేవ ఆస్పత్రి స్టేషన్‌లో ఎల్లో లైన్‌తో అనుసంధానం
- నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గించడంతోపాటు ప్రయాణ సమయం ఆదా

బెంగళూరు: నగర ప్రజా రవాణా వ్యవస్థలో మరో కీలక ముందడుగు పడింది. బెంగళూరు నమ్మ మెట్రో పింక్ లైన్‌లోని తొలి దశ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. కలేన అగ్రహార నుంచి తావరెకెరె వరకు నిర్మించిన 7.5 కిలోమీటర్ల ఎలివేటెడ్ మార్గంలో గురువారం ట్రయల్ రన్ నిర్వహించారు. శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ మార్గాన్ని ప్రారంభించనున్నారు. 14 నుంచి ప్రయాణికులకు సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ మార్గం అందుబాటులోకి వస్తే బెంగళూరు మెట్రో నెట్‌వర్క్ 100 కిలోమీటర్ల మైలురాయిని దాటుతుంది. ఈ 7.5 కిలోమీటర్ల మార్గంలో కలేన అగ్రహార, హులిమావు, ఐఐఎంబీ, జేపీ నగర్ నాలుగో దశ, జయదేవ ఆస్పత్రి, తావరెకెరె స్టేషన్లు ఉంటాయి. ప్రారంభంలో ప్రతి ఎనిమిది నిమిషాలకు ఒక మెట్రో రైలు నడిపేలా ఏర్పాట్లు చేశారు. ఈ మార్గం నిర్మాణానికి సుమారు రూ.3,470 కోట్లు ఖర్చు చేశారు. ఈ మార్గంలో జయదేవ ఆస్పత్రి స్టేషన్ కీలకంగా మారనుంది. ఇక్కడి నుంచి ఎల్లో లైన్‌కు మారే సదుపాయం ఉంటుంది. దీంతో బన్నేరఘట్ట రోడ్డు పరిసర ప్రాంతాల ప్రజలు ఎలక్ట్రానిక్ సిటీ వైపు వెళ్లేందుకు సులభమవుతుంది. మెట్రో ప్రయాణంతో రోడ్లపై వాహనాల రద్దీ తగ్గడంతో పాటు ప్రయాణ సమయం, ఇంధన ఖర్చులు ఆదా కానున్నాయి. పింక్ లైన్ పూర్తిస్థాయిలో కలేన అగ్రహార నుంచి నాగవార వరకు 21.26 కిలోమీటర్ల మేర విస్తరించనుంది. ఇందులో 7.5 కి.మీ. ఎలివేటెడ్ మార్గం కాగా, మిగిలిన భాగం భూగర్భ మార్గం. ఈ పనులు పూర్తయితే ఎంజీ రోడ్డు, శివాజీనగర్, కంటోన్మెంట్ తదితర ప్రాంతాలకూ మెట్రో అనుసంధానం ఏర్పడుతుంది.

తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు

- మోతె శోభన్‌రెడ్డి నివాసం వద్ద వివిధ జిల్లాల ఉద్యమకారుల ఆందోళన
- సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ



ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడు మోతె శోభన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఉద్యమకారులు ఆయన నివాసాన్ని ముట్టడించి ఆందోళన చేపట్టారు. తమ సమస్యలను త్వరగా పరిష్కరించకపోతే లక్ష్మణ్ గౌడ్ తరహాలో తమ పరిస్థితి కూడా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన నేపథ్యంలో శోభన్‌రెడ్డి సంయమనంతో స్పందించారు. నిరసనకారులను అరెస్టు చేయవద్దని పోలీసులను కోరారు. ఏళ్ల తరబడి ఉద్యమకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తనకు తెలుసని, ఆవేశంలో ప్రాణాల మీదకు తెచ్చుకునే నిర్ణయాలు తీసుకోవద్దని వారికి నచ్చజెప్పారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉద్యమకారుల సమస్యలపై పూర్తి అవగాహన ఉందని పేర్కొన్నారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం త్వరలో ప్రత్యేక వెబ్‌సైట్‌తోపాటు అధికారిక కార్యాలయాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. స్వరాష్ట్ర సాధన కోసం పోరాడిన ప్రతి నిజమైన ఉద్యమకారుడిని గుర్తించి, ప్రభుత్వపరంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఉద్యమకారులకు అండగా ఉంటుందని భరోసా కల్పించడంతో ఆందోళనకారులు శాంతించారు.

నేడు సిద్దిపేటకు కల్వకుంట్ల కవిత

తెలంగాణ రక్షణ సేన కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన

- ఆలయం, దర్గా, చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు
- ఉ.11 గం.కు మీడియాతో మాట్లాడనున్న కవిత

ప్రజానావ, సిద్దిపేట: తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత శుక్రవారం సిద్దిపేటలో పర్యటించనున్నారు. జిల్లా కేంద్రంలోని రంగధాంపల్లి తెలంగాణ అమరవీరుల స్తూపం చౌరస్తా వద్ద పార్టీ కార్యాలయ భవన నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారు. హైదరాబాద్, నిజామాబాద్ తర్వాత సిద్దిపేటలో పార్టీ కార్యాలయాన్ని నిర్మిస్తున్నారు. కవిత పర్యటన నేపథ్యంలో పార్టీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేస్తున్నాయి. శుక్రవారం ఉదయం 7 గంటలకు బంజారా హిల్స్‌లోని తన నివాసం నుంచి బయలుదేరి, 9 గంటలకు సిద్దిపేటకు చేరుకుంటారు. తొలుత శ్రీ ఉమా పార్వతి కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఇక్బాల్ మినార్ సమీపంలోని జానుల్లా షా దర్గాలో చాదర్ సమర్పిస్తారు.

ఆ తర్వాత ఆర్డీవో కార్యాలయం సమీపంలోని సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఉదయం 10 గంటలకు రంగధాంపల్లి చౌరస్తా వద్ద తెలంగాణ రక్షణ సేన కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తారు. అనంతరం ఉదయం 11 గంటలకు నిర్మాణ స్థలంలోనే మీడియాతో మాట్లాడనున్నారు.





కల్యాణలక్ష్మికి గెజిటెడ్ ధ్రువీకరణ నిబంధన తొలగించాలి

- బీజేవైఎం నేత దండుగుల శేఖర్ విజ్ఞప్తి



ప్రజానావ, హైదరాబాద్: కల్యాణలక్ష్మి పథకం దరఖాస్తుకు గెజిటెడ్ అధికారి సంతకం లేదా ధ్రువీకరణ తప్పనిసరి అనే నిబంధనను తొలగించాలని బీజేవైఎం ఖైరతాబాద్ నాయకుడు దండుగుల శేఖర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిబంధనతో పథకానికి అర్హులైన పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఆడపిల్లల వివాహానికి ఆర్థిక భరోసా కల్పించే కల్యాణలక్ష్మి పథకం ఎంతో ఉపయోగకరమైనదని పేర్కొన్నారు. అయితే గెజిటెడ్ అధికారి ధ్రువీకరణ కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం, సమయం వృథా కావడంతో పాటు పేద కుటుంబాలపై అదనపు భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని గెజిటెడ్ అధికారి ధ్రువీకరణ నిబంధనను తొలగించి, తహసీల్దార్ లేదా సంబంధిత అధికారుల ద్వారా ధ్రువీకరణ పొందేలా సరళమైన విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పథకం అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

నిజాలను కూడా అబద్ధాలుగా చిత్రీకరిస్తున్నాయి

- బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై ప్రియాంక గాంధీ ధ్వజం



వయనాడ్: తన తల్లి, కాంగ్రెస్ సీనియర్ నేత సోనియా గాంధీపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఇన్నాళ్లూ అసత్య ప్రచారం చేశాయని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా ఆరోపించారు. ఇప్పుడు సోనియా తన ఆత్మకథలో వాస్తవాలను వెల్లడిస్తుంటే వాటిని కూడా అబద్ధాలుగా చిత్రీకరిస్తున్నాయని విమర్శించారు. ఇటీవల విడుదలైన సోనియా జ్ఞాపకాల పుస్తకంపై బీజేపీ విమర్శలకు గురువారం ఆమె స్పందించారు. తన తల్లి గురించి బీజేపీ, ఆర్ఎస్ఎస్, ఇతరులు ఎన్నో కల్పిత కథనాలు ప్రచారం చేసినా ఇన్నాళ్లూ ఆమె మౌనంగా ఉన్నారని ప్రియాంక తెలిపారు. ఇప్పుడు తన కథను తాను చెప్పుకునే హక్కు సోనియాకు ఉందన్నారు. ఆమె నిజాలు వెల్లడిస్తుంటే విమర్శించడం సహజమేనని, కనీసం బీజేపీ నేతలు పుస్తకం చదువుతున్నందుకు సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. సోనియా ఇటీవల విడుదల చేసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకాన్ని బీజేపీ తప్పుల్ని కప్పిపుచ్చే ప్రయత్నంగా అభివర్ణించింది. 1975 నాటి అత్యవసర పరిస్థితిని సమర్థించడంతోపాటు, 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల విషయంలో దివంగత రాజీవ్ గాంధీకి క్లీన్‌చిట్ ఇచ్చేందుకు ఆమె ప్రయత్నించారని ఆరోపించింది. దీనిపై ప్రియాంక స్పందిస్తూ.. సోనియా తన అభిప్రాయాలు, అనుభవాలనే పుస్తకంలో పొందుపరిచారని, ప్రతి ఒక్కరికీ తమదైన కథ, వ్యక్తిగత అభిప్రాయాలు ఉంటాయని పేర్కొన్నారు.

పద్మశాలి సంఘం స్వర్ణోత్సవాలకు ప్రముఖులకు ఆహ్వానం

- ఎమ్మెల్సీ ఎలగందుల రమణ, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌కు ఆహ్వాన పత్రికల అందజేత
- 50ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని వేడుకల నిర్వహణ

ప్రజానావ, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం 50 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న స్వర్ణోత్సవ వేడుకలకు కరీంనగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎలగందుల రమణ, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌ను సంఘం ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు వారికి ఆహ్వాన పత్రికలను అందజేసి, వేడుకలకు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కత్తుల సుదర్శన్‌రావు, ప్రధాన కార్యదర్శి కల్లేపల్లి రాజునేత, కోశాధికారి ఎలగందుల అంజయ్య, ఉపాధ్యక్షుడు బొమ్మర్ల సతీష్‌కుమార్, ముషీరాబాద్ నియోజకవర్గ పద్మశాలి సంఘం అధ్యక్షుడు అత్తినగరం సుదేష్, కార్యదర్శులు వనం శ్రీనివాస్, ఎస్.ఎస్. చక్రధర్, ఎస్.ఎస్. జయరాజు, మునిపల్లి నరేందర్, సికింద్రాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మంద జగన్, మంద మురళి తదితరులు పాల్గొన్నారు.





ఈవేం కళ్లద్దాలురా బాబోయ్!

చెల్లింపులు చేస్తాయ్.. భాషా అడ్డంకులనూ తొలగిస్తాయ్!

జియో ఏఐ కళ్లద్దాల్లో సరికొత్త సదుపాయాలు

చేతిలో ఫోన్ లేకపోయినా చెల్లింపులు చేయొచ్చు.. మనకు తెలియని భాషలో ఎదుటివారు మాట్లాడినా అర్థం చేసుకోవచ్చు.. సమావేశాల్లో ముఖ్యమైన అంశాలను ప్రత్యేకంగా రాసుకోకపోయినా వాటిని గుర్తుంచుకోవచ్చు. ఇవన్నీ ఒకే పరికరంతో సాధ్యమయ్యేలా రిలయన్స్ జియో సరికొత్త కృత్రిమ మేధ ఆధారిత కళ్లద్దాలను రూపొందించింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన భారత మొబైల్ కాంగ్రెస్–2026లో ఈ సాంకేతికతను ప్రదర్శించింది. కెమెరా కళ్లద్దాలు, శ్రవణ కళ్లద్దాలు, చెవిలో పెట్టుకునే పరికరాలతో పాటు పలు కృత్రిమ మేధ ఆధారిత ఉత్పత్తులను సంస్థ పరిచయం చేసింది. ముఖ్యంగా నగదు రహిత చెల్లింపులు, భారతీయ భాషల్లో సంభాషణ, ప్రత్యక్ష అనువాదం, క్రికెట్ వ్యాఖ్యానం వంటి సదుపాయాలు వీటిలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.





కళ్లద్దాలతోనే చెల్లింపులు

జియో కృత్రిమ మేధ కళ్లద్దాల్లో అందరినీ ఆకట్టుకుంటున్న సదుపాయం 'స్కాన్ అండ్ పే'. సాధారణంగా నగదు రహిత చెల్లింపులు చేయాలంటే ఫోన్ తీసి, తాళం తెరిచి, చెల్లింపుల అనువర్తనంలోకి వెళ్లి దుకాణంలోని సంకేత చిత్రాన్ని స్కాన్ చేయాలి. అయితే ఈ కళ్లద్దాలతో ఆ అవసరం ఉండదు. వాటిలో అమర్చిన కెమెరా సాయంతో చెల్లింపుల సంకేత చిత్రాన్ని స్కాన్ చేసి, మాటల ఆదేశం ద్వారా చెల్లింపుల ప్రక్రియను ప్రారంభించవచ్చు. వినియోగదారు నిర్ధారించిన తర్వాత లావాదేవీ పూర్తవుతుంది. యూపీఐ సర్కిల్ నిబంధనల ప్రకారం ఒక్కో లావాదేవీకి గరిష్ఠంగా రూ.5,000 వరకు, నెలకు రూ.15,000 వరకు చెల్లింపులు చేసే అవకాశం ఉంది. ఇవి యూపీఐ సర్కిల్ నిర్దేశించిన పరిమితులే.

మన భాషలో మాట్లాడితే.. మరో భాషలో వినొచ్చు

భారతదేశంలో భాషా వైవిధ్యం ఎక్కువ. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లినప్పుడు స్థానిక భాష తెలియక ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ఈ సమస్యను అధిగమించేందుకు జియో కళ్లద్దాల్లో ప్రత్యక్ష అనువాద సదుపాయాన్ని తీసుకొచ్చింది. ఇద్దరు వ్యక్తులు వేర్వేరు భారతీయ భాషల్లో మాట్లాడితే, వారి మాటలను కృత్రిమ మేధ సాయంతో మరో భాషలోకి అనువదించుకోవచ్చు. దీంతో ఎదుటివారు చెప్పే విషయాలను సులభంగా అర్థం చేసుకోవచ్చు. ప్రయాణాలు, వ్యాపార సమావేశాలు, ఇతర ప్రాంతాల వారితో సంభాషణల సమయంలో ఈ సదుపాయం ఉపయోగపడనుంది. వినియోగదారులు తమకు తెలిసిన భాషలోనే సాంకేతిక సేవలను పొందేలా చేయడం దీని ఉద్దేశం.

సమావేశాల్లో ముఖ్యాంశాలన్నీ నమోదు

కార్యాలయ సమావేశాల్లో ముఖ్యమైన విషయాలను ఎప్పటికప్పుడు రాసుకోవడం కొన్నిసార్లు కష్టంగా ఉంటుంది. ఏదైనా అంశాన్ని మర్చిపోతే తర్వాత ఇబ్బందులు ఎదురవుతాయి. ఈ సమస్యకు పరిష్కారంగా జియో కళ్లద్దాల్లో కృత్రిమ మేధ ఆధారిత నోట్ టేకింగ్ సదుపాయాన్ని కూడా ప్రదర్శించింది. సమావేశాల్లో చర్చించిన ముఖ్యమైన అంశాలను గుర్తించి, వాటిని నోట్స్ రూపంలో నమోదు చేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. దీంతో ప్రతి విషయాన్నీ చేతితో రాసుకోవాల్సిన అవసరం తగ్గుతుంది. సమావేశం ముగిసిన తర్వాత ముఖ్యమైన వివరాలను మరోసారి పరిశీలించుకోవచ్చు. అయితే ఈ వివరాలను ఎలా భద్రపరుస్తారు? వాటిని తిరిగి ఎలా పొందవచ్చు? అనే అంశాలపై పూర్తి సమాచారం వెల్లడికావాల్సి ఉంది.

పనిలో ఉన్నా.. క్రికెట్ వ్యాఖ్యానం వినొచ్చు


క్రికెట్ అభిమానులను దృష్టిలో పెట్టుకుని ప్రత్యక్ష వ్యాఖ్యానం వినే సదుపాయాన్నీ జియో ప్రదర్శించింది. టీవీ ముందు కూర్చునే అవకాశం లేనివారు, ప్రయాణాల్లో ఉన్నవారు లేదా ఇతర పనుల్లో నిమగ్నమైనవారు మ్యాచ్‌లో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. కళ్లద్దాల ద్వారా వ్యాఖ్యానం వింటూ మ్యాచ్ వివరాలను తెలుసుకునే వీలుంటుంది. దీంతో ఇతర పనులు చేసుకుంటూనే క్రికెట్ మ్యాచ్‌ను అనుసరించవచ్చు.

రోజువారీ పనుల్లోనూ కృత్రిమ మేధ సేవలు

కేవలం వినోదానికే కాకుండా కార్యాలయ పనులు, సమావేశాలు, ప్రయాణాలు వంటి రోజువారీ అవసరాలకు అనుగుణంగా ఈ పరికరాలను రూపొందించారు. మాటల ఆదేశాలతో కృత్రిమ మేధతో సంభాషించడం, అవసరమైన సమాచారాన్ని తెలుసుకోవడం వంటి సదుపాయాలనూ అందిస్తున్నారు. ప్రతిసారీ ఫోన్‌ను బయటకు తీసి చూడాల్సిన అవసరాన్ని తగ్గించడం వీటి ప్రధాన ఉద్దేశం. కళ్లద్దాలతో పాటు కెమెరా కళ్లద్దాలు, శ్రవణ కళ్లద్దాలు, చెవిలో పెట్టుకునే పరికరాలను కూడా ప్రదర్శనలో ఉంచారు.

ధర, విడుదల తేదీపై స్పష్టత రావాల్సి ఉంది

భారతీయ వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా కృత్రిమ మేధ సేవలను సామాన్యులకు చేరువ చేయడమే లక్ష్యంగా జియో ఈ పరికరాలను రూపొందించింది. ముఖ్యంగా స్థానిక భాషల్లో సేవలు, మాటల ఆదేశాలు, ప్రత్యక్ష అనువాదం, సమావేశాల వివరాల నమోదు, నగదు రహిత చెల్లింపులు వంటి సదుపాయాలు రోజువారీ జీవితంలో ఉపయోగపడనున్నాయి. అయితే ఈ కళ్లద్దాల ధర ఎంత? మార్కెట్లోకి ఎప్పుడు విడుదల చేస్తారు? సాధారణ వినియోగదారులకు ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తాయి అనే వివరాలను సంస్థ ఇంకా వెల్లడించలేదు. సాంకేతిక పరికరాల వినియోగంలో కొత్త మార్పులకు అవకాశం ఏర్పడనుంది.



నిద్రలోనే ఇష్టమైన పాటలు వినండి!

- మార్కెట్‌లోకి పిల్లో స్పీకర్స్
- ఇయర్ ఫోన్లు అవసరం లేకుండానే ఆడియో వినే సౌకర్యం
- బ్లూటూత్ కనెక్టివిటీ, ఏడు రాత్రుల బ్యాటరీ బ్యాకప్
- 90 నిమిషాల ఆటో ఆఫ్ టైమర్ సదుపాయం

నిద్రపోయే ముందు పాటలు వినడం, పాడ్‌కాస్ట్‌లు వినడం చాలామందికి అలవాటు. అయితే ఇయర్‌ఫోన్లు, హెడ్‌ఫోన్లు పెట్టుకుని నిద్రపోవడం వల్ల చెవులపై ఒత్తిడి పడటంతోపాటు అసౌకర్యం కలగవచ్చు. ఈ సమస్యకు ప్రత్యామ్నాయంగా పిల్లో స్పీకర్ అందుబాటులోకి వచ్చింది. అమెజాన్‌లో డ్రీమ్‌వేవ్ పిల్లో స్పీకర్ ఫర్ స్లీపింగ్ పేరుతో విక్రయిస్తున్న ఈ పరికరం ప్రస్తుతం 71 శాతం తగ్గింపుతో రూ.288కే లభిస్తోంది. దీని అసలు ధర రూ.999గా పేర్కొన్నారు. ఈ స్పీకర్‌ను దిండు కింద ఉంచి బ్లూటూత్ ద్వారా స్మార్ట్‌ఫోన్‌కు అనుసంధానం చేసుకోవచ్చు. ఇందులో బోన్ కండక్షన్ టెక్నాలజీని ఉపయోగించినట్లు తయారీ సంస్థ వెల్లడించింది. దీనివల్ల ఇయర్‌ఫోన్లు పెట్టుకోకుండానే దిండు మీదుగా ఆడియో వినే సౌకర్యం కలుగుతుంది. పాటలు, పాడ్‌కాస్ట్‌లు, ప్రశాంతమైన శబ్దాలను వినేందుకు ఉపయోగపడుతుంది. ఒకే మంచంపై ఇద్దరు నిద్రించే సందర్భాల్లో, హాస్టళ్లలో ఇతరులతో కలిసి ఉండేవారికి పక్కవారికి ఇబ్బంది కలగకుండా ఆడియో వినేందుకు ఇది ఉపకరిస్తుంది.

పలుచని ఆకారం.. తక్కువ బరువు

సాధారణ ఇయర్‌ఫోన్లు, హెడ్‌ఫోన్లు ధరించి పక్కకు తిరిగి పడుకుంటే చెవులపై ఒత్తిడి పడే అవకాశం ఉంటుంది. ఈ ఇబ్బందిని తగ్గించేలా అరోఆర్ట్ ఎక్స్ 3 పిల్లో స్పీకర్‌ను పలుచని ఆకారంలో రూపొందించారు. దీని మందం సుమారు 11 మిల్లీమీటర్లు కాగా, బరువు 82 గ్రాములుగా ఉంది. దిండు కింద సులభంగా అమర్చుకునేలా తయారు చేశారు. తక్కువ బరువు కారణంగా ప్రయాణాల సమయంలోనూ వెంట తీసుకెళ్లవచ్చు. అయితే దిండు మందం, స్పీకర్ ఉంచే స్థానం ఆధారంగా ఆడియో వినిపించే తీరు మారవచ్చు.

ఆటో ఆఫ్ టైమర్‌తో బ్యాటరీ ఆదా

ఈ పరికరాన్ని బ్లూటూత్ సదుపాయం ఉన్న స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్లకు వైర్లు లేకుండానే అనుసంధానం చేసుకోవచ్చు. ఇందులో 30, 60, 90 నిమిషాల ఆటో ఆఫ్ టైమర్ సదుపాయం ఉంది. నిద్రపోయే ముందు తమకు నచ్చిన సమయాన్ని ఎంచుకుంటే, నిర్ణీత వ్యవధి పూర్తయ్యాక స్పీకర్ దానంతట అదే ఆగిపోతుంది. దీంతో రాత్రంతా పరికరం పనిచేయకుండా బ్యాటరీని ఆదా చేసుకోవచ్చు. ఈ పిల్లో స్పీకర్‌లో అధిక సామర్థ్యం గల బ్యాటరీని అమర్చినట్లు కంపెనీ పేర్కొంది. ఒక్కసారి పూర్తిగా ఛార్జ్ చేస్తే సాధారణ వినియోగాన్ని బట్టి ఏడు రాత్రుల వరకు ఉపయోగించుకోవచ్చని తెలిపింది.

బ్లూటూత్ కనెక్షన్‌తో పాటు ఆటో ఆఫ్ టైమర్

ఈ పిల్లో స్పీకర్‌ను బ్లూటూత్ సదుపాయం ఉన్న స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్లకు కనెక్ట్ చేసుకోవచ్చు. ప్రత్యేక వైర్లు అవసరం లేదు. కంపెనీ వివరాల ప్రకారం, ఇందులో 30, 60, 90 నిమిషాల ఆటో ఆఫ్ టైమర్ సదుపాయం ఉంది. అంటే మనకు నచ్చిన సమయాన్ని ఎంచుకుంటే, ఆ సమయం పూర్తయ్యాక స్పీకర్ ఆటోమేటిక్‌గా ఆగేలా సెట్ చేసుకోవచ్చు.



ఎన్నికలపై విద్యార్థులకు పోటీలు

ప్రజానావ, వేములవాడ: విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించేందుకు వేములవాడ నియోజకవర్గ స్థాయిలో వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన సుమారు 128 మంది విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలను వేములవాడ ఆర్డీవో కెఎస్ బి కుమారి పరిశీలించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిలో వ్యాసరచన విభాగం నుంచి 10 మంది, క్విజ్ విభాగం నుంచి 10 మందిని ఎంపిక చేశారు. మొత్తం 20 మంది విద్యార్థులు జిల్లా స్థాయిలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించడంతో పాటు బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.



కొత్తచెరువు నాళాల సర్వే కోసం ధర్నా

ప్రజానావ, సిరిసిల్ల: సిరిసిల్ల పట్టణంలోని కొత్తచెరువు నాళాల కబ్జాలను తొలగించి, పూర్వపు నాళాలను గుర్తించేందుకు వెంటనే సర్వే చేపట్టాలని ఏఐఎఫ్‌టీయూ న్యూ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సోమిశెట్టి దశరథం మాట్లాడుతూ కబ్జాదారులపై చర్యలు తీసుకొని పాత నాళాలను పునరుద్ధరించాలని, శ్రీనగర్ కాలనీలో తాత్కాలిక వరద కాలువను తొలగించాలని, 60 ఫీట్ల రోడ్డును పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండ శ్యామ్, గుజ్జ దేవదాస్, అకేనా సత్తయ్య, రాచకొండ నారాయణ, పంతం సుజాత, కొనమేని భారత, సునీత, గడ్డం రేణుక, కొమిరే రజిత, తడిగొప్పుల వజ్రవ్వ, గాజుల కళావతి తదితరులు పాల్గొన్నారు.



ఈవోను కలిసిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ జేపీసీ నాయకులు

ప్రజానావ, వేములవాడ: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఈవో రమాదేవిని తెలంగాణ స్టేట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ జేపీసీ కమిటీ (రిజిస్టర్ నెం. 1148/2023) రాజన్న సిరిసిల్ల జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.తెలంగాణ ఔట్‌సోర్సింగ్ జేపీసీ రాష్ట్ర చైర్మన్ అధ్యక్షులు పులి లక్ష్మయ్య ఆదేశాల మేరకు,జిల్లా జేపీసీ ఉపాధ్యక్షులు దయ్యాల కొమరయ్య, బొప్ప శేఖర్, కూలేరు సాగర్, కార్యదర్శి క్యాతం నరేష్ ఈవోతో సమావేశమయ్యారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రాజన్న సేవలో అమరావతి రూరల్ ఏఎస్పీ

ప్రజానావ, వేములవాడ: వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన భీమేశ్వరస్వామి వారిని మహారాష్ట్రలోని అమరావతి రూరల్ అదనపు ఎస్పీ శ్రీదత్తా లక్ష్మణ్ టోటేవాడ్ గురువారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు, వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందజేసి, స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.

పేద, మధ్యతరగతి ప్రజలకు అండగా సర్కార్



ప్రజానావ, పెద్దపల్లి: పేద, మధ్యతరగతి ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అండ గా నిలుస్తోంది. రేషన్ కార్డుదారులకు ఉచిత సన్న బియ్యంతో పాటు గోధుమ పిండి, పప్పు దినుసులు, వంట నూనె తదితర నిత్యావసర సరుకులను తక్కువ ధరలకు అందించాలనే నిర్ణయం అభినందనీయమని పీజీఎస్ఏఐ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు లక్ష్మన్ బాబు, రామగుండం నియోజకవర్గ అధ్యక్షులు మంధేన వెంకటేష్ అన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్ల వంటి సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.





8,209 మందికి కొత్త పెన్షన్లు

- 19 నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ
- ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ప్రజానావ, వేములవాడ: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. వేములవాడ పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి చేయూత నూతన పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్‌తో కలిసి ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లాలో కొత్తగా 8,209 మందికి పెన్షన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నెల 19వ తేదీ నుంచి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పెన్షన్ నగదు జమ కానుందని వెల్లడించారు. ఇప్పటికే జిల్లాలో 1,13,264 మందికి పెన్షన్లు అందుతుండగా, కొత్తగా మంజూరైన వాటితో కలిపి మొత్తం 1,21,473 మందికి ప్రతి నెలా పెన్షన్లు అందనున్నాయని వివరించారు. ఇందుకోసం ప్రభుత్వం నెలకు సుమారు రూ.25.97 కోట్లు ఖర్చు చేయనుందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలతో పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.

18 వరకు మంజూరు పత్రాల పంపిణీ పూర్తి

కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, తలసేమియా, సికిల్ సెల్, హిమోఫీలియా బాధితులు, గీత, నేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితుల నుంచి ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తులు స్వీకరించి, అధికారులతో క్షేత్రస్థాయిలో విచారణ చేయించినట్లు తెలిపారు. ఈ నెల 18వ తేదీ వరకు మంజూరు పత్రాల పంపిణీ పూర్తిచేస్తామని, 19వ తేదీ నుంచి ఖాతాల్లో నగదు జమ అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్లు రొండి రాజు, చెలుకల తిరుపతి, కచ్చకాయల ఎల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్లు పకులాభరణం శ్రీనివాస్, బొమ్మెన భాస్కర్, ఏగోలపు శ్రీనివాస్, గసికంటి ప్రభాకర్, పిల్లి కనకయ్య, ఆర్డీఓ కేవీఎస్‌బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీ నారాయణ, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

ఐఆర్‌సీఎస్ సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేయాలి

- సభ్యత్వ నమోదు మరింత పెంచాలి
- ఇండియన్ రెడ్ క్రాస్ ప్రెసిడెంట్, కలెక్టర్ గరిమ అగ్రవాల్
- బాధ్యులతో సమావేశం



ప్రజానావ, సిరిసిల్ల : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) మేనేజింగ్ కమిటీ జిల్లాలో సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేయాలని ఇండియన్ రెడ్ క్రాస్ ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, పిలుపునిచ్చారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులతో ఇండియన్ రెడ్ క్రాస్ ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని గురువారం సమావేశం నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఐఆర్ సీఎస్ సభ్యులు జిల్లాలో ఒక ప్రణాళిక ప్రకారం సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఐఆర్ సీఎస్ కార్యాలయం, సూతన్ బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు, సభ్యత్వ నమోదు తదితర కార్యక్రమాలను పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఐఆర్ సీఎస్ జిల్లా చైర్మన్ గూడూరి రవీందర్, వైస్ చైర్మన్ ప్రయాకరావు వేణు కుమార్, సెక్రటరీ సీహెచ్ సంతోష్ కుమార్, సలహాదారు ఈవీ శ్రీనివాస్ రావు, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడు పీవీ సంజీవ రెడ్డి, కోశాధికారి చంద్రగిరి శ్రీధర్, మేనేజింగ్ కమిటీ సభ్యులు ఎం. అజయ్ బాబు, ఏ శివప్రసాద్ కే బాబు, సీహెచ్ శ్రీనివాస్, దేవదాస్, అరుణ,రాజు, సురేంద్ర బాబు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల సేవలు వినియోగించుకోవాలి

తంగళ్లపల్లి: అంగన్వాడీ కేంద్రాల సేవలు వినియోగించుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. తంగళ్లపల్లి మండలం పద్మనగర్ అంగన్వాడీ కేంద్ర నిర్మాణ పనులు పూర్తికాగా, గురువారం జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై భవనాన్ని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రతి రోజూ తల్లిదండ్రులు బాధ్యతగా తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు క్రమం తప్పకుండా పంపాలని సూచించారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఇప్పటి నుంచే సరైన పోషకాహారం అందించాలని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు నిత్యం పంపిణీ చేపడంతో పిల్లలకు పోషకాహారం అందుతుందని, ఆట, పాటలు బొమ్మల ద్వారా విద్య బుద్ధులు చెపుతారని వివరించారు. అంగన్వాడి కేంద్రాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారని కొనియాడారు.సామ్, మామ్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. తీవ్రమైన పోషకాహార లోపం, మధ్యస్థ తీవ్ర పోషకాహార లోపం, తీవ్రమైన తక్కువ బరువు, మధ్యస్థ తక్కువ బరువు ఉన్న పిల్లలకు ప్రత్యేక శ్రద్ధ పెట్టి.. అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం అందిస్తారని వివరించారు. వారికి బాలామృతం ప్లస్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు.ప్రతి మంగళవారం 10 నిమిషాలు కార్యక్రమాన్ని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్రాల సేవలు, వసతులు మెరుగు పరచడం, పోషకాహారం పంపిణీ, బాలల హక్కుల రక్షణ, వసతుల పెంపు తదితర అంశాలపై కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొనాలని సూచించారు.



గంజాయి విక్రయించేందుకు యత్నించిన ఇద్దరు అరెస్ట్

- వైన్ షాపుల్లో వరుస దొంగతనాలకు పాల్పడిన నిందితులు
- 72 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజానావ, వేములవాడ: గంజాయి విక్రయించేందుకు యత్నించిన ఇద్దరు వ్యక్తులను వేములవాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి విచారణలో పలు ప్రాంతాల్లోని వైన్ షాపుల్లో జరిగిన దొంగతనాలు కూడా వెలుగులోకి వచ్చాయి. వేములవాడ పట్టణ పరిధిలోని చెక్కపల్లి రోడ్డులో పెద్దమ్మ గుడి సమీపంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారంతో టౌన్ ఎస్సై ఎస్. ప్రేమానందం తన సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద 160 గ్రాముల గంజాయి లభించింది. దీంతో మహబూబాబాద్ జిల్లాకు చెందిన బానోత్ సురేష్ (33), జగిత్యాల జిల్లాకు చెందిన రాంపెల్లి మహేందర్ (28)లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 160 గ్రాముల గంజాయితో పాటు హోండా డియో స్కూటీ, రెండు వివో మొబైల్ ఫోన్లు, రూ.400 నగదును స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు వేములవాడ, కరీంనగర్, సిద్దిపేట, భువనగిరి, కాజీపేట ప్రాంతాల్లోని పలు వైన్ షాపుల్లో దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడైంది. కరీంనగర్‌లోని విఘ్నేశ్వర వైన్స్‌లో జరిగిన చోరీకి సంబంధించిన 72 మద్యం సీసాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును చాకచక్యంగా ఛేదించి నిందితులను పట్టుకున్న ఎస్సై ఎస్. ప్రేమానందం, పోలీస్ కానిస్టేబుళ్లు ఇమ్రాన్, నరేందర్‌తో పాటు సహకరించిన ఇతర సిబ్బందిని వేములవాడ పోలీస్ ఇన్‌స్పెక్టర్ వీర ప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు.

ఆది శ్రీనివాస్ త్వరగా కోలుకోవాలని పూజలు





ప్రజానావ, రాజన్న సిరిసిల్ల/వేములవాడ అర్బన్: ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కాలికి గాయం కావడంతో ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆరెపల్లి గ్రామంలోని భక్త ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ సర్పంచ్ ఇటిక్యాల రాజు, కిసాన్ సెల్ అధ్యక్షుడు ఇటిక్యాల లింగయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు సిలువని మల్లేశం, గ్రామస్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజారి తునికి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించి ఆది శ్రీనివాస్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.

విప్‌కు సర్పంచుల పరామర్శ

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కాలికి గాయం కావడంతో వేములవాడ అర్బన్ పరిధిలోని బీఆర్ఎస్ సర్పంచ్‌లు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు రెడ్డవేణి పరశురామ్,ఊరడి సునీత, రాజిరెడ్డి,ముత్త సంజన మహేష్ ఆది శ్రీనివాస్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.

భీమేశ్వరాలయంలో మూడోరోజు కార్తీక దీపోత్సవం

ప్రజానావ, వేములవాడ: వేములవాడ భీమేశ్వర గుడిలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సామూహిక కార్తీక దీపోత్సవం వైభవంగా కొనసాగుతోంది. గురువారం మూడో రోజు దీపోత్సవ కార్యక్రమాన్ని ఆలయ ఈవో రమాదేవి ప్రారంభించారు. నవంబర్ 10 నుంచి డిసెంబర్ 8 వరకు ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు సుహాసినుల ఆధ్వర్యంలో దీపోత్సవం నిర్వహిస్తున్నారు. పాల్గొన్న మహిళలకు ఆలయ అర్చకులు, అధికారులు పసుపు, కుంకుమ, గాజులు, వాయనం, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఏఈవో జయకుమారి, పర్యవేక్షకులు, సిబ్బంది ఉన్నారు.




జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న చందనోత్సవం, మహా సంప్రోక్షణ కార్యక్రమాలకు హాజరుకావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలను ఆలయ అధికారులు ఆహ్వానించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం, ఈవో అంజనా రెడ్డి, ఆలయ అర్చకులు, అధికారులు ముఖ్యమంత్రి, మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికలు అందజేసి సత్కరించారు.

– ప్రజానావ, జగిత్యాల

పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి

- మాతృ మరణాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
- డీఎంహెచ్ఓ డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్



ప్రజానావ, సిరిసిల్ల: జిల్లాలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలను పూర్తిగా అరికట్టేందుకు పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన పీసీపీఎన్‌డీటీ సలహా కమిటీ సమావేశంలో స్కానింగ్ కేంద్రాల నిర్వహణ, నిబంధనల అమలుపై సమీక్షించారు. నిబంధనలు ఉల్లంఘించే కేంద్రాలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం నిర్వహించిన మాతృ మరణాల సమీక్షలో నేరెళ్ల పీహెచ్‌సీ పరిధిలో నమోదైన ఒక మాతృ మరణ కేసును పరిశీలించారు. గర్భిణీలను ముందుగానే గుర్తించడం, హైరిస్క్ గర్భిణీలకు ప్రత్యేక వైద్య పర్యవేక్షణ, ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రల వినియోగం, సకాలంలో వైద్య పరీక్షల ద్వారా మాతృ మరణాలను నివారించాలని సూచించారు. ఈ సమావేశాల్లో డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్రబాబు, డా. ఎం. సుగుణ, డా. సంగీతారెడ్డి, డా. పరమేష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజినీకాంత్, డా. సీహెచ్. సంతోష్, చింతోజు భాస్కర్, ప్రసాద్, వైద్యాధికారి చంద్రిక తదితరులు పాల్గొన్నారు.



2026-30లో భారత్‌దే అగ్రస్థానం

ప్రపంచంలోని పది ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో అత్యంత స్థిరమైన దేశంగా భారత్

- 100కు 71 పాయింట్లతో తొలి ర్యాంకు
- 2021–25లో మూడో ర్యాంకు నుంచి మొదటి స్థానానికి
- వృద్ధి, పొదుపు, పెట్టుబడుల్లో మెరుగైన పనితీరు
- 66 పాయింట్లతో రెండో స్థానంలో చైనా: అసోచామ్ నివేదిక

ప్రపంచంలోని పది ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో 2026–30 మధ్య అత్యంత స్థిరమైన ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలవ నుందని అసోచామ్ నివేదిక వెల్లడించింది. మొత్తం 100 పాయింట్లకు గాను భారత్ 71 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. చైనా 66 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. 'భారత ఆర్థిక ఆధిక్యం.. టాప్ టెన్ ఆర్థిక వ్యవస్థలు' పేరుతో రూపొందించిన ఈ నివేదికలో జపాన్, రష్యా 60 పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచాయి. వాస్తవ జీడీపీ వృద్ధి, ఎగుమతుల పెరుగుదల, కరెంట్ ఖాతా నిల్వలు, ప్రభుత్వ రుణభారం, ద్రవ్యలోటు, తలసరి జీడీపీ వృద్ధి, స్థూల పొదుపులు, మూలధన పెట్టుబడులు సహా పది స్థూల ఆర్థిక సూచికలను పరిగణనలోకి తీసుకుని ఈ అంచనా రూపొందించారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) వరల్డ్ ఎకనామిక్ ఔట్‌లుక్ డేటా ఆధారంగా ఆయా దేశాలకు ర్యాంకులు కేటాయించి, వాటిని పాయింట్లుగా మార్చి మొత్తం స్కోరును లెక్కించారు. 2021–25 కాలాన్ని గత పనితీరు అంచనాకు, 2026–30 కాలాన్ని భవిష్యత్ అంచనాకు ప్రాతిపదికగా తీసుకున్నారు. 2026–30 అంచనాల్లో వాస్తవ జీడీపీ వృద్ధి, తలసరి జీడీపీ వృద్ధిలో భారత్ మొదటి స్థానంలో నిలిచింది. స్థూల పొదుపులు, మూలధన పెట్టుబడుల్లో రెండో ర్యాంకు, ఎగుమతుల వృద్ధి, రుణం–జీడీపీ నిష్పత్తిలో మూడో ర్యాంకు సాధించింది. ప్రాథమిక ద్రవ్యలోటు విషయంలో ఐదో స్థానంలో, కరెంట్ ఖాతా నిల్వలు, నిర్మాణాత్మక ద్రవ్యలోటులో ఏడో స్థానంలో, మొత్తం ద్రవ్యలోటులో ఎనిమిదో స్థానంలో నిలిచింది. చైనా ఎగుమతుల వృద్ధి, స్థూల పొదుపులు, మూలధన పెట్టుబడుల్లో మొదటి స్థానంలో ఉండగా.. జీడీపీ, తలసరి జీడీపీ వృద్ధిలో రెండో స్థానాన్ని సాధించింది.

సంస్కరణలు కొనసాగించాలి

భారత ఆర్థిక ప్రగతిలో విధాన నిర్ణేతలు, వ్యాపార సంస్థలు, కార్మిక శక్తి కీలక పాత్ర పోషించాయని అసోచామ్ ముఖ్య ఆర్థికవేత్త ఎస్.పి. శర్మ పేర్కొన్నారు. సంస్కరణలను కొనసాగించడం, ప్రైవేటు పెట్టుబడులను పెంచడం, తయారీ రంగం, ఎగుమతులను విస్తరించడం, ప్రపంచ స్థాయి నైపుణ్యాలు కలిగిన ఉద్యోగులను తయారు చేయడం ద్వారా ఈ పురోగతిని కొనసాగించవచ్చని తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేయాలని సూచించారు. మూలధనం, విద్యుత్, నిబంధనల అమలు, రవాణా, కార్మిక వ్యయాలను తగ్గిస్తే దేశీయ పరిశ్రమలకు సమాన అవకాశాలు లభిస్తాయని అభిప్రాయపడ్డారు. 2021–25 కాలంలో భారత్ 66 పాయింట్లతో పది దేశాల్లో మూడో స్థానంలో నిలిచింది. రష్యా 74, చైనా 71 పాయింట్లతో భారత్ కంటే ముందున్నాయి. తాజా అంచనాల్లో భారత్ స్కోరు 71కు పెరగడంతో పాటు మూడు నుంచి మొదటి స్థానానికి చేరుకుంది. మిగిలిన దేశాల్లో జర్మనీ 59, ఇటలీ, బ్రెజిల్ 53 చొప్పున, బ్రిటన్ 52, ఫ్రాన్స్ 40, అమెరికా 36 పాయింట్లు సాధించాయి.

ప్రపంచంలోని పది ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో 2026–30 మధ్య అత్యంత స్థిరమైన ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలవ నుందని అసోచామ్ నివేదిక వెల్లడించింది. మొత్తం 100 పాయింట్లకు గాను భారత్ 71 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. చైనా 66 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. 'భారత ఆర్థిక ఆధిక్యం.. టాప్ టెన్ ఆర్థిక వ్యవస్థలు' పేరుతో రూపొందించిన ఈ నివేదికలో జపాన్, రష్యా 60 పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచాయి. వాస్తవ జీడీపీ వృద్ధి, ఎగుమతుల పెరుగుదల, కరెంట్ ఖాతా నిల్వలు, ప్రభుత్వ రుణభారం, ద్రవ్యలోటు, తలసరి జీడీపీ వృద్ధి, స్థూల పొదుపులు, మూలధన పెట్టుబడులు సహా పది స్థూల ఆర్థిక సూచికలను పరిగణనలోకి తీసుకుని ఈ అంచనా రూపొందించారు.



పుతిన్‌తో అమెరికా రాయబారుల భేటీ

- రెండు గంటలపాటు సాగిన చర్చలు
- శాంతి ఒప్పందం దిశగా మరో అడుగు
- అబుధాబీ చర్చల్లో పలు అంశాలపై ఏకాభిప్రాయం.. మరికొన్నింటిపై భిన్నాభిప్రాయాలు



మాస్కో: రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి తెరదించి శాంతి ఒప్పందం కుదిర్చేందుకు అమెరికా ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక రాయబారులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్ గురువారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశమయ్యారు. క్రెమ్లిన్‌లో దాదాపు రెండు గంటలపాటు సాగిన ఈ భేటీలో.. అబుధాబీలో రష్యా, ఉక్రెయిన్ ప్రతినిధులతో జరిపిన చర్చల వివరాలను పుతిన్‌కు వివరించారు. ఇరుదేశాల మధ్య శాంతి ఒప్పందం కుదరాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. ఇప్పటికే అబుధాబీలో రష్యా, ఉక్రెయిన్ ప్రతినిధి బృందాలతో అమెరికా రాయబారులు రెండు రోజులపాటు చర్చలు జరిపారు. తొమ్మిది నెలలుగా నిలిచిపోయిన శాంతి చర్చలు మళ్లీ ప్రారంభమైన తర్వాత ఇరుదేశాల ప్రతినిధులు ప్రత్యక్షంగా సమావేశమవడం ఇదే తొలిసారి. ఈ చర్చల్లో అనేక అంశాలపై ఏకాభిప్రాయం కుదిరినప్పటికీ.. మరికొన్ని విషయాల్లో భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్నాయని కుష్నర్ తెలిపారు. పుతిన్‌తో భేటీ అనంతరం అమెరికా రాయబారులు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో సమావేశమయ్యేందుకు ఐర్లాండ్ వెళ్లనున్నారు. మరోవైపు, మాస్కోతో చర్చలు జరిపేందుకు యూరప్ దేశాల తరపున ఒకే ప్రతినిధిని నియమించాలని అమెరికా, జెలెన్స్కీ భావిస్తున్నారు. అయితే యూరోపియన్ దేశాలతో నేరుగా చర్చలు జరిపేందుకు రష్యా ఆసక్తి చూపడం లేదు. దీంతో శాంతి ఒప్పందం దిశగా తదుపరి చర్చలు ఎలా సాగుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

అలిస్‌పై సింగపూర్ నిషేధం

- దేశంలోకి తిరిగి రావొద్దని ఆదేశం

సింగపూర్: చైనా గూఢచారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అలిస్‌కు సింగపూర్ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఆమెను తమ దేశంలోకి తిరిగి రాకుండా నిషేధించినట్లు ఆ దేశ హోంశాఖ ప్రకటించింది. సర్వర్ల కొనుగోళ్లకు సంబంధించి మెగాస్పీడ్ సంస్థ తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించిందన్న ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. సర్వర్లను సింగపూర్ నుంచి మలేసియాకు ఎగుమతి చేసి, అక్కడి నుంచి అసలు గమ్యస్థానానికి మళ్లించారా? అనే కోణంలో సింగపూర్ పోలీసులు గతంలోనే విచారణ చేపట్టారు. ఈ క్రమంలో అలిస్ పాస్‌పోర్టును స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఆమె నేరాలకు పాల్పడినట్లు ఆధారాలు లభించకపోవడంతో పాస్‌పోర్టును తిరిగి ఇచ్చారు. విచారణ సమయంలో తప్పుడు సమాచారం ఇచ్చినట్లు అనుమానించిన అధికారులు.. ఇకపై సింగపూర్‌లోకి తిరిగి రావొద్దని ఆమెను హెచ్చరించారు. తమ దేశంతో ఉన్న సంబంధాలను ఆసరాగా చేసుకుని నిబంధనలను ఉల్లంఘించే, అక్రమ కార్యకలాపాలకు పాల్పడే సంస్థలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని సింగపూర్ హోంశాఖ స్పష్టం చేసింది.

వివాదాల వలలో ఎన్విడియా

ఒక్కసారిగా చుట్టుముట్టిన వివాదాలు

- సీఈఓ జెన్సన్ హువాంగ్ వ్యవహారాలతో కంపెనీకి తలనొప్పి
- 5శాతం పతనమైన షేర్లు
- నెల రోజుల్లో 30శాతానికి పైగా క్షీణత
- ఏఐ బబుల్ భయాలతో ఇన్వెస్టర్లలో కలవరం

ప్రపంచ ఏఐ రంగంలో కీలక నం ష్ఠగా ఎదిగిన చిప్‌ల తయారీ దిగ్గజం ఎన్విడియాకు కష్టాలు మొదలయ్యాయి. సంస్థ సీఈఓ జెన్సన్ హువాంగ్ వైదొలగనున్నారన్న ప్రచారంతోపాటు ఆయన వ్యక్తిగత వ్యవహారాలపై వెలువడుతున్న కథనాలు కంపెనీ షేర్లపై ప్రభావం చూపుతున్నాయి. గురువారం మధ్యాహ్నం ట్రేడింగ్‌లో ఎన్విడియా షేర్లు 5శాతం పడిపోయాయి. నెల రోజుల క్రితం నమోదైన గరిష్ఠ స్థాయితో పోలిస్తే 30 శాతానికి పైగా క్షీణించాయి. చైనా గూఢచారిగా అనుమానిస్తున్న మహిళతో హువాంగ్‌కు సంబంధం ఉన్నట్లు వచ్చిన కథనాలు చర్చనీయాంశమయ్యాయి. తనకు నేరుగా నివేదించే మహిళా ఎగ్జిక్యూటివ్‌తోనూ ఆయనకు సంబంధం ఉన్నట్లు బుధవారం న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రచురించింది. ఈ పరిణామాలు సంస్థ నాయకత్వంపై అనిశ్చితిని పెంచుతున్నాయి. మరోవైపు ఏఐ రంగంలో పెట్టుబడుల బబుల్ ఏర్పడుతోందన్న ఆందోళనలు కూడా షేర్ల పతనానికి కారణమవుతున్నాయి.

ప్రత్యర్థులకు పెరుగుతున్న ఆదరణ

హువాంగ్ వైదొలగడం ఎన్విడియాలో కొత్త అధ్యాయానికి నాంది కావచ్చని యార్క్‌విల్లే ఐప్స్ అండ్ కంపెనీ భాగస్వామి డాన్ ఐప్స్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఎన్విడియా మార్కెట్ విలువ 4 లక్షల కోట్ల డాలర్లకు పైగా ఉంది. ఈ ఏడాది నాస్‌డాక్ ర్యాలీలో కీలక పాత్ర పోషించిన సంస్థ షేర్లు పడిపోతుండగా, గత నెలలో నాస్‌డాక్ సూచీ కూడా 7శాతం క్షీణించింది. మరోవైపు ప్రత్యర్థి సంస్థలైన ఏఎండీ, బ్రాడ్‌కామ్ షేర్లు పుంజుకున్నాయి. ఎన్విడియాలో సుమారు 13శాతం వాటా ఉన్న డేటా సెంటర్, క్లౌడ్ సేవల సంస్థ కోర్‌వీవ్ షేర్లు మాత్రం 7 శాతానికి పైగా పడిపోయాయి.



మూడో రోజూ తగ్గిన బంగారం ధర


- ఢిల్లీలో 10 గ్రాములపై రూ.2,200 పతనం.. స్థిరంగా వెండి

న్యూఢిల్లీ: దేశీయ మార్కెట్‌లో బంగారం ధరల పతనం కొనసాగుతోంది. వరుసగా మూడో రోజూ పసిడి ధర తగ్గింది. గురువారం ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం ధర రూ.2,200 తగ్గి రూ.1,43,400కు చేరింది. బుధవారం ఈ ధర రూ.1,45,600గా ఉంది. మరోవైపు వెండి ధరలో ఎలాంటి మార్పు లేకుండా కిలో రూ.1,87,500 వద్ద స్థిరంగా కొనసాగింది. దేశీయంగా కొనుగోళ్ల ఆసక్తి తగ్గడం, అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పడిపోవడం బంగారంపై ఒత్తిడి పెంచాయని వ్యాపార వర్గాలు తెలిపాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 39.93 డాలర్లు (ఒక శాతం) తగ్గి 3,950 డాలర్ల దిగువకు పడిపోయింది. బలమైన అమెరికా డాలర్ కారణంగా పసిడికి డిమాండ్ తగ్గిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకుడు సౌమిల్ గాంధీ పేర్కొన్నారు. వెండి ధర కూడా 1.17 శాతం తగ్గి ఔన్సుకు 51.06 డాలర్లకు చేరింది.

డాలర్ కదలికలపై దృష్టి

డాలర్ ఇండెక్స్ 103 స్థాయి వద్ద ఉన్న కీలక నిరోధాన్ని అధిగమిస్తే 104.50 వరకు పెరిగే అవకాశం ఉందని, అదే జరిగితే బంగారం, వెండి ధరలపై మరింత ఒత్తిడి పడుతుందని మిరాయ్ అసెట్ షేర్‌ఖాన్ కమోడిటీస్ విభాగాధిపతి ప్రవీణ్ సింగ్ తెలిపారు. గురువారం డాలర్ ఇండెక్స్ 102.88 వద్ద ట్రేడయింది.





న్యూయార్క్‌లో కుప్పకూలిన భవనం

- ఎనిమిది మంది మృతి.. మరో 17 మందికి గాయాలు
- శిథిలాల కింద మరి కొంతమంది
- 250 మందితో సహాయక చర్యలు చేపట్టిన అధికారులు
- తప్పకాలే ప్రమాదానికి కారణమని అనుమానం

న్యూయార్క్: అమెరికాలోని న్యూయార్క్ నగరం బ్రూక్లిన్‌లో మూడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటనలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా, మరో 17 మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక, సహాయక బృందాలు వెంటనే రంగంలోకి దిగాయి. శిథిలాల కింద చిక్కుకున్న పలువురిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. మరికొందరి ఆచూకీ కోసం జాగిలాల సాయంతో గాలింపు కొనసాగిస్తున్నారు. సుమారు 250 మంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నట్లు అధికారులు తెలిపారు. 1930లో నిర్మించిన ఈ పురాతన భవనం పక్కనే ఉన్న స్థలంలో కొత్త నిర్మాణం కోసం తవ్వకాలు జరుపుతుండగా కూలిపోయినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ప్రమాదానికి కచ్చితమైన కారణాలపై విచారణ చేపట్టారు.

ఆసియా కప్ ఫైనల్లో భారత్

• అండర్–19 సెమీ ఫైనల్‌లో అఫ్గానిస్థాన్‌పై 8 వికెట్లతో ఘన విజయం • రేపు పాకిస్థాన్‌తో టైటిల్ పోరు



అల్ అమరత్: అండర్–19 ఆసియా కప్‌లో భారత యువ జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన సెమీఫైనల్లో అఫ్గానిస్థాన్‌ను 8 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. కెప్టెన్ లక్ష్య రైచందానీ (93) అద్భుత బ్యాటింగ్‌తో జట్టుకు ఘన విజయాన్ని అందించాడు. తొలుత ఇషాన్ సూద్ నేతృత్వంలోని భారత బౌలర్లు అఫ్గానిస్థాన్‌ను 227/8కే పరిమితం చేశారు. అనంతరం భారత్ 36.5 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి 230 పరుగులు చేసి లక్ష్యాన్ని ఛేదించింది. మరో సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌ను 9 వికెట్లతో ఓడించిన పాకిస్థాన్ ఫైనల్‌కు చేరింది. శనివారం (నవంబర్ 14) భారత్–పాక్ మధ్య టైటిల్ పోరు జరగనుంది.

రైచందానీ మెరుపు ఇన్నింగ్స్

లక్ష్య ఛేదనలో రైచందానీ ఏమాత్రం తొందరపడకుండా అఫ్గాన్ బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించాడు. 90 బంతుల్లో 13 ఫోర్లు, ఒక సిక్స్‌తో 93 పరుగులు చేశాడు. 39 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. తొలి వికెట్‌కు ఓపెనర్ ఆర్య వీర్ సెహ్వాగ్ (51)తో కలిసి 17 ఓవర్లలో 117 పరుగులు జోడించాడు. రెండో వికెట్‌కు వీకే వినీత్ (57 నాటౌట్)తో కలిసి మరో 77 పరుగులు సాధించాడు. సెంచరీకి చేరువైన రైచందానీ.. సోహైల్ ఖాన్ బౌలింగ్‌లో ఎక్స్‌ట్రా కవర్ మీదుగా షాట్ ఆడే ప్రయత్నంలో మొహమ్మద్ అలీకి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అప్పటికే భారత్ విజయానికి చేరువైంది. వినీత్ వరుస బంతుల్లో ఫోర్, సిక్స్ బాది మ్యాచ్‌ను ముగించాడు.

సెహ్వాగ్ అర్ధశతకం

ఓపెనర్ ఆర్యవీర్ సెహ్వాగ్ కూడా వేగంగా ఆడుతూ మూడు సిక్సర్లతో అఫ్గాన్ బౌలర్లపై ఒత్తిడి పెంచాడు. 56 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. అయితే ఆ వెంటనే నూర్ అలీ బౌలింగ్‌లో పుల్ షాట్ ఆడే ప్రయత్నంలో ఫరీదుల్లా ఇహ్సాన్‌కు క్యాచ్ ఇచ్చి పెటయ్యాడు. ఇషాన్ సూద్ మూడు వికెట్లు అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్థాన్‌ను భారత బౌలర్లు కట్టడి చేశారు. పేసర్ ఇషాన్ సూద్ 43 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. మధ్య ఓవర్లలో స్పిన్నర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో అఫ్గాన్ బ్యాటర్లు పరుగులు సాధించేందుకు ఇబ్బంది పడ్డారు. వికెట్ కీపర్ బ్యాటర్ నోమన్ సలార్జాయ్, షా ఫైసల్ రహీమీ చెరో



51 పరుగులు చేసినా జట్టు భారీ స్కోరు సాధించలేక పోయింది.

పాక్ ఘన విజయం

మరో సెమీఫైనల్లో పాకిస్థాన్ 9 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. పేసర్ రిజ్వానుల్లా 30 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టడంతో బంగ్లాదేశ్ 31.4 ఓవర్లలో 138 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ అబ్దుల్లా అల్ ముహి (50) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. అనంతరం పాక్ ఓపెనర్లు ఉస్మాన్ ఖాన్ (64 నాటౌట్), హయామ్ ఖాన్ (69) తొలి వికెట్‌కు 123 పరుగులు జోడించి జట్టుకు విజయాన్ని అందించారు. పాకిస్థాన్ 21.5 ఓవర్లలోనే 141/1 స్కోరు చేసింది. గ్రూప్ దశలో భారత్‌ను ఓడించిన పాక్‌తో ఇప్పుడు ఫైనల్లో భారత యువ జట్టు తలపడనుంది.

నేడు కివీస్‌తో నాలుగో వన్డే

• గిల్, రాహుల్ దూరం.. శ్రేయస్‌కు కెప్టెన్సీ
• ఇషాన్, రుతురాజ్‌కు అవకాశం..



బే ఓవల్: ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా శుక్రవారం భారత్, న్యూజిలాండ్ నాలుగో మ్యాచ్‌లో తలపడనున్నాయి. తొలి రెండు వన్డేల్లో నెగ్గిన భారత్ 2–0తో ఆధిక్యంలో ఉండగా.. మూడో మ్యాచ్ వర్షంతో రద్దయింది. ఈ మ్యాచ్‌కు వాతావరణం అనుకూలంగా ఉండటంతో పాటు పిచ్ బ్యాటర్లకు సహకరించే అవకాశాలున్నాయి. తొలి రెండు వన్డేల్లో సీమర్లకు అనుకూలించిన పిచ్‌లపై బ్యాటర్లు ఇబ్బందిపడ్డారు. పరిస్థితులు భిన్నంగా ఉండొచ్చని అంచనా.

శ్రేయస్‌కు సారథ్య బాధ్యతలు

టెస్టు సిరీస్ కోసం శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, పేసర్ అన్షుల్ కంబోజ్ వన్డే జట్టును వీడటంతో శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. షార్ట్ బంతులను ఎదుర్కోవడంలో ఇబ్బందిపడుతున్న అతడు ఈ మ్యాచ్‌లో సత్తా చాటాల్సి ఉంది. రోహిత్‌తో కలిసి ఇషాన్ కిషన్ ఓపెనింగ్ చేసే అవకాశముంది. రుతురాజ్ గైక్వాడ్ మిడిల్ ఆర్డర్‌లో ఆడొచ్చు. తొలి రెండు మ్యాచ్‌ల్లో 0, 23 పరుగులే చేసిన రోహిత్ నుంచి భారీ ఇన్నింగ్స్‌ను జట్టు ఆశిస్తోంది. కంబోజ్ స్థానంలో సిరాజ్‌ను తీసుకుంటారా? కుల్‌దీప్‌కు అవకాశం ఇస్తారా? అన్నది ఆసక్తికరం. అర్ష్‌దీప్, గుర్నూర్, ఆకిబ్ నబి పేస్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. స్పిన్ విభాగంలో అక్షర్ పటేల్, నమన్ ధీర్ కీలకం కానున్నారు.

కొత్త కూర్పుతో కివీస్

సొంతగడ్డపై 2007 తర్వాత వరుసగా 11 వన్డే సిరీస్‌లు గెలిచిన న్యూజిలాండ్ విజయపరంపరకు భారత్ ఈ సిరీస్‌తో అడ్డుకట్ట వేసింది. టెస్టు సిరీస్ నేపథ్యంలో లేథమ్, డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్, నాథన్ స్మిత్, నికోల్స్ జట్టును వీడగా.. ఫిన్ అలెన్, మిచ్ హే, డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్, నిక్ కెల్లీ, బ్రెట్ రాండెల్ జట్టులోకి వచ్చారు. రెండో వన్డేలో గాయపడిన టిక్నర్ ఈ మ్యాచ్‌కూ దూరం కానున్నాడు. పరుగుల కోసం ఇబ్బందిపడుతున్న ఓపెనర్ సీఫర్ట్ ఈసారైనా రాణించాలని కివీస్ ఆశిస్తోంది. కొత్త జట్టుతో భారత్‌ను ఎదుర్కోవడం ఆ జట్టుకు సవాలే.

ఐఓఏ అధ్యక్ష పీఠంపై పీటీ ఉష గురి

• ఐస్ హాకీ సమాఖ్య నుంచి మహిళా ప్రతినిధిగా నామినేషన్ • అర్హతపై సందేహాలు.. సమాఖ్య సభ్యత్వమే కీలకం • డిసెంబరు 5న ఐఓఏ కార్యవర్గ ఎన్నికలు



న్యూఢిల్లీ: భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలిగా మరోసారి ఎన్నికయ్యేందుకు పీటీ ఉషకు కొత్త అవకాశం లభించింది. ఐఓఏ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ఐస్ హాకీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐహెచ్ఏఐ) గురువారం తన ప్రతినిధులుగా ఇద్దరి పేర్లను ప్రతిపాదించింది. మహిళా ప్రతినిధిగా పీటీ ఉషను, పురుష ప్రతినిధిగా సమాఖ్య ప్రధాన కార్యదర్శి హర్జిందర్ సింగ్‌ను నామినేట్ చేసింది. ఇటీవల 'స్పోర్ట్స్‌పర్సన్స్ ఆఫ్ మెరిట్' (ఎస్ఓఎం) ఎన్నికల్లో ఓడిపోయిన ఉషకు ఈ పరిణామం ఊరటనిచ్చింది. అయితే, ఐస్ హాకీ సమాఖ్యలో ఆమెకు సభ్యత్వం ఉందా? లేదా? అన్నదానిపై స్పష్టత లేకపోవడంతో నామినేషన్ అర్హతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సమాఖ్య సభ్యత్వం తప్పనిసరి

ఐఓఏ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన 30 జాతీయ క్రీడా సమాఖ్యలు ఒక్కో పురుష, మహిళా ప్రతినిధిని జనరల్ బాడీకి నామినేట్ చేయాలని ఎన్నికల అధికారి సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సూచించారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల్లోగా పేర్లు సమర్పించాలని గడువు విధించారు. అయితే, నామినేట్ చేసిన వ్యక్తి సంబంధిత సమాఖ్యలో సభ్యుడై ఉండాలనే నిబంధన ఉంది. ఐఓఏ ఎన్నికల నోటిఫికేషన్‌తో పాటు ఈ ఏడాది సెప్టెంబరులో ఆమోదించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 10.4 కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది. ప్రతినిధి భారత పౌరుడై ఉండటంతోపాటు 70 ఏళ్లలోపు వయసు కలిగి, సంబంధిత సమాఖ్యలో సభ్యుడై ఉండాలి. ఈ నేపథ్యంలో అథ్లెటిక్స్ దిగ్గజం పీటీ ఉషకు ఐస్ హాకీ సమాఖ్యలో సభ్యత్వం ఉందా? అన్నది తేలాల్సి ఉంది.

సభ్యత్వంపై భిన్నాభిప్రాయాలు

సమాఖ్యలోని రాష్ట్ర విభాగం లేదా యూనిట్ తరఫున సమావేశాలు, కార్యక్రమాల్లో పాల్గొన్న వారిని కూడా సభ్యులుగా పరిగణించే అవకాశం ఉందని ఓ సీనియర్ అధికారి అభిప్రాయపడ్డారు. సమాఖ్యలోని ఏదైనా కమిటీలో సభ్యుడిగా ఉన్నా అర్హత లభిస్తుందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఐస్ హాకీ సమాఖ్యలో కొంతకాలంగా వివాదాలు కొనసాగుతున్నాయి. పలు వర్గాలు తామే అధికారిక జాతీయ సమాఖ్యలమని చెప్పుకుంటున్నాయి. అయితే, గురుప్రీత్ సింగ్ బక్షి నేతృత్వంలోని ఐస్ హాకీ అసోసియేషన్ ఆఫ్ ఇండియాను మాత్రమే ఐఓఏ గుర్తిస్తోంది. అయితే ఏ జాతీయ సమాఖ్యకూ క్రీడల మంత్రిత్వ శాఖ గుర్తింపు లేదు.

71మందితో ఓటర్ల బృందం

ఐఓఏ కార్యవర్గ ఎన్నికల కోసం మొత్తం 71 మందితో ఎలక్టోరల్ కాలేజీ ఏర్పాటు కానుంది. ఇందులో 30 జాతీయ క్రీడా సమాఖ్యలు నామినేట్ చేసే 60 మంది, ఇప్పటికే ఎన్నికైన ఎనిమిది మంది ఎస్ఓఎంలు, అథ్లెట్ల కమిషన్ ప్రతినిధులు మీరాబాయి చాను, సాజన్ ప్రకాశ్, భారత్‌లోని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) సభ్యురాలు నీతా అంబానీ ఉంటారు. ఈ బృందంలోని అర్హులైన వారు ఐఓఏ నూతన కార్యవర్గ ఎన్నికల్లో పోటీ చేయవచ్చు.

అధ్యక్ష పదవికి పలువురు ఆశావహులు

వివిధ క్రీడా సమాఖ్యల నుంచి ఆదిల్లె సుమరివాలా (అథ్లెటిక్స్), రాజీవ్ మెహతా (ఫెన్సింగ్), రాహుల్ బోస్ (రగ్బీ), వీరేంద్ర సచ్‌దేవా (ఆర్చరీ), కల్యాణ్ చౌబే (ఫుట్‌బాల్), సహదేవ్ యాదవ్ (వెయిట్‌లిఫ్టింగ్), అజయ్ పటేల్ (షూటింగ్), సంజయ్ సింగ్ (రెజ్లింగ్) తదితరులు ప్రతినిధులుగా నామినేట్ అయ్యారు. ప్రస్తుత కార్యవర్గంలోని కనీసం ఏడు గురికి మరోసారి అవకాశం దక్కింది. ఐఓఏ అధ్యక్ష పదవికి ఆదిల్లె సుమరివాలాతోపాటు ఎస్ఓఎంలుగా ఎన్నికైన గగన్ నారంగ్, సైనా నెహ్వాల్ పేర్లు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను శుక్రవారం స్వీకరించనున్నారు. శనివారం పరిశీలించి ఆదివారం తుది జాబితాను ప్రకటిస్తారు. డిసెంబరు 5న ఐఓఏ కార్యవర్గ ఎన్నికలు జరగనున్నాయి.



అంబేకర్, గుంజన్‌కు పసిడి పతకాలు

• యూత్ ఒలింపిక్స్ బాక్సింగ్‌లో భారత్‌కు ఇవే తొలి స్వర్ణాలు

డకార్: యూత్ ఒలింపిక్స్ బాక్సింగ్‌లో భారత క్రీడాకారులు చరిత్ర సృష్టించారు. పురుషుల 50 కేజీల విభాగంలో ఎల్. అంబేకర్ మీతెయ్, మహిళల 48 కేజీల విభాగంలో గుంజన్ స్వర్ణ పతకాలు సాధించారు. గురువారం జరిగిన ఫైనల్స్‌లో అంబేకర్ 3–2తో ఐర్లాండ్ బాక్సర్ క్రిస్టియన్ జుబానీని ఓడించగా.. గుంజన్ 5–0తో అల్జీరియాకు చెందిన బౌతైనా బెన్సలామ్‌పై ఘన విజయం సాధించింది. యూత్ ఒలింపిక్స్ బాక్సింగ్‌లో భారత్‌కు తొలి స్వర్ణాలు అందించిన ఘనత వీరిద్దరికీ దక్కింది. ఈ పోటీల్లో స్వర్ణం సాధించిన తొలి భారత మహిళా బాక్సర్‌గా గుంజన్ రికార్డు నెలకొల్పింది. మణిపూర్‌కు చెందిన అంబేకర్ పటియాలాలోని జాతీయ క్రీడా సంస్థ (ఎన్ఐఎస్)లో శిక్షణ పొందుతున్నాడు. క్వార్టర్ ఫైనల్లో నమీబియా బాక్సర్ అబ్రహం కలెంగాను తొలి రౌండ్‌లోనే ఓడించాడు. సెమీఫైనల్లో కొలంబియాకు చెందిన ఇజ్జోన్ జెఫ్రీ గలియా అరేవాలోపై 5–0తో విజయం సాధించాడు. తుదిపోరులో ఐర్లాండ్ ప్రత్యర్థి నుంచి తీవ్ర పోటీ ఎదురైనా.. 3–2తో పైచేయి సాధించి స్వర్ణాన్ని కైవసం చేసుకున్నాడు.

గుంజన్ ఏకపక్ష విజయం

హరియాణాకు చెందిన గుంజన్ క్వార్టర్ ఫైనల్లో మెక్సికో బాక్సర్ అటెనా సోఫియా జువారెజ్ కలెరోను 5–0తో ఓడించింది. సెమీఫైనల్లో బ్రిటన్‌కు చెందిన లిల్లీ బాసెట్‌పై 4–1తో గెలిచి తుదిపోరుకు చేరింది. ఫైనల్లో అల్జీరియా బాక్సర్‌పై ఆరంభం నుంచే ఆధిపత్యం ప్రదర్శించింది. ఐదుగురు న్యాయనిర్ణేతలూ ఆమెకే అనుకూలంగా తీర్పునివ్వడంతో 5–0తో స్వర్ణం ఖరారైంది.

సఖీబ్ ఖాన్ సంచలనం

• అరంగేట్రంలోనే ఏడు వికెట్లు
• తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 446 పరుగులకు ఆలౌట్
• పాక్‌కు 12 పరుగుల స్వల్ప ఆధిక్యం

రావల్పిండి: పాకిస్థాన్ యువ ఫాస్ట్ బౌలర్ సఖీబ్ ఖాన్ అరంగేట్రం టెస్టులోనే అదరగొట్టాడు. ఏకంగా ఏడు వికెట్లు పడగొట్టి శ్రీలంక బ్యాటింగ్ పతనాన్ని శాసించాడు. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో 404/4తో పటిష్ఠ స్థితిలో ఉన్న శ్రీలంక.. గురువారం నాలుగో రోజు ఆటలో 446 పరుగులకే ఆలౌటైంది. ఫలితంగా పాకిస్థాన్‌కు 12 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో పాక్ 57/1 స్కోరుతో ఉన్న సమయంలో వెలుతురులేమి, ఆ తర్వాత వర్షం కారణంగా ఆట నిలిచిపోయింది. దీంతో నాలుగో రోజు ఆట ముందుగానే ముగిసింది. ప్రస్తుతం పాకిస్థాన్ 45 పరుగుల ఆధిక్యంలో ఉంది.

ఎనిమిది ఓవర్లలో ఐదు వికెట్లు

ఓవర్‌కాస్ట్ పరిస్థితులను సఖీబ్ పూర్తిగా సద్వినియోగం చేసుకున్నాడు. నాలుగో రోజు ఉదయం వరుసగా ఎనిమిది ఓవర్లు బౌలింగ్ చేసి 25 పరుగులకే ఐదు వికెట్లు పడగొట్టాడు. రాత్రి 167 పరుగులతో అజేయంగా ఉన్న ధనంజయ డిసిల్వాను, 119 పరుగులు చేసిన కెప్టెన్ కుశాల్ మెండిస్‌ను పెవిలియన్‌కు పంపాడు. వీరిద్దరి మధ్య 249 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు. ఆ తర్వాత సోనాల్ దినుషాను కూడా స్లిప్స్‌లో క్యాచ్ ఇప్పించి ఔట్ చేశాడు. ఐదో వికెట్ తీసిన అనంతరం పిచ్‌కు ముద్దుపెట్టుకుని తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు. మిలన్ రత్నాయకే పాక్ తొలి ఇన్నింగ్స్ స్కోరు 434/9ను దాటించినప్పటికీ.. సఖీబ్ మరో రెండు వికెట్లు తీసి శ్రీలంకను దెబ్బతీశాడు. అసిత ఫెర్నాండోను వికెట్ కీపర్ ఘాజీ ఘోరీ క్యాచ్ పట్టగా, చివరకు రత్నాయకేను రజావుల్లా ఔట్ చేయడంతో శ్రీలంక ఇన్నింగ్స్ ముగిసింది. మొత్తంగా 130 పరుగులిచ్చి ఏడు వికెట్లు తీసిన సఖీబ్.. పాకిస్థాన్ తరఫున అరంగేట్రం టెస్టులోనే ఈ ఘనత సాధించిన నాలుగో బౌలర్‌గా నిలిచాడు.

రెండో ఇన్నింగ్స్‌లో పాక్ నిలకడ

12 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్థాన్.. తొలి వికెట్‌గా అరంగేట్ర ఆటగాడు తయాబ్ ఆరిఫ్ (11)ను కోల్పోయింది. అసిత ఫెర్నాండో అతడిని ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. అనంతరం అజాన్ అవైస్ (22), మరో అరంగేట్ర ఆటగాడు మహమ్మద్ తాహా (24 నాటౌట్) జాగ్రత్తగా ఆడుతూ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. అవైస్ 17 పరుగుల వద్ద ఇచ్చిన క్యాచ్‌ను శ్రీలంక కెప్టెన్ కుశాల్ మెండిస్ వదిలేశాడు. రెండో సెషన్ మధ్యలో పాక్ 57/1తో ఉన్నప్పుడు వెలుతురులేమి కారణంగా ఆట నిలిచింది.

• ఏటీపీ ఫైనల్స్..

అల్కరాజ్‌పైనే అందరి చూపు!

• వరుసగా పది విజయాలతో టురిన్‌కు స్పెయిన్ స్టార్
• వియన్నా, పారిస్ టైటిళ్లతో జోరుమీదున్న యువ ఆటగాడు
• నంబర్‌వన్ జ్వెరెవ్‌కు వరుస ఓటములు.. గాయంతో టోర్నీకి దూరమైన సినర్

టురిన్: ఈ ఏడాది అత్యంత ప్రతిష్ఠాత్మక టైటిళ్లు గెలిచి ప్రపంచ నంబర్‌వన్ ర్యాంకు సాధించిన అలెగ్జాండర్ జ్వెరెవ్ కంటే.. ప్రస్తుతం కార్లోస్ అల్కరాజ్‌పైనే ఏటీపీ ఫైనల్స్‌లో ఎక్కువ అంచనాలు నెలకొన్నాయి. వరుస విజయాలతో అద్భుత ఫామ్‌లో ఉన్న అల్కరాజ్.. తొలిసారి ఈ టోర్నీ టైటిల్‌ను అందుకోవాలని పట్టుదలగా ఉన్నాడు. మణికట్టు గాయం కారణంగా ఏడాది మధ్యలో నాలుగున్నర నెలలు ఆటకు దూరమైన అతడు.. తిరిగి బరిలోకి వచ్చాక వరుసగా పది విజయాలు సాధించాడు. వియన్నా, పారిస్ టైటిళ్లను కూడా ఖాతాలో వేసుకున్నాడు. మరోవైపు జ్వెరెవ్ మాత్రం వరుసగా రెండు ఓటములతో టోర్నీలో అడుగుపెడుతున్నాడు.

తొలి టైటిల్‌పై గురి

గత వారం పారిస్ మాస్టర్స్ ఫైనల్లో బెన్ షెల్టన్‌ను ఓడించిన తర్వాత అల్కరాజ్ తన లక్ష్యాన్ని వెల్లడించాడు. ఏటీపీ ఫైనల్స్ టైటిల్ గెలవడం తన చిరకాల కోరికని, ఈసారి పూర్తి ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతున్నానని చెప్పాడు. గతేడాది ఫైనల్లో జానిక్ సినర్ చేతిలో ఓడిన అతడు.. ఈసారి ఆ లోటును భర్తీ చేయాలని చూస్తున్నాడు. గతంలో ఇండోర్ కోర్టుల్లో ఆడేందుకు ఇబ్బందిపడిన అల్కరాజ్.. ఇప్పుడు ఆ బలహీనతను అధిగమించాడు. ప్రస్తుత పది విజయాల పరంపరలో ఇండోర్ కోర్టుల్లో కేవలం ఒక్క సెట్ మాత్రమే కోల్పోయాడు. షాట్ల ఎంపికలో మెరుగుదల, గాయం కారణంగా ఆటకు దూరంగా ఉన్న సమయంలో లభించిన మానసిక విశ్రాంతి అతడికి కలిసొచ్చాయని మాజీ ప్రపంచ నంబర్‌వన్ జిమ్ కూరియర్ విశ్లేషించాడు.


విమర్శలతో జ్వెరెవ్ అసహనం

ప్రపంచ నంబర్‌వన్ జ్వెరెవ్ ఇటీవల వియన్నాలో అలెక్స్ డి మినార్, పారిస్‌లో లోరెంజో ముసెట్టీ చేతిలో ఓడిపోయాడు. అల్కరాజ్, సినర్ గాయాల కారణంగానే తాను అగ్రస్థానానికి చేరానంటూ వస్తున్న విమర్శలపై అతడు అసహనం వ్యక్తం చేశాడు. ప్రపంచ నంబర్‌వన్‌గా తన అర్హతను నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోందని, ఈ వ్యాఖ్యలు చికాకు కలిగిస్తున్నాయని పేర్కొన్నాడు. ఏటీపీ ఫైనల్స్‌లో మూడోసారి టైటిల్ గెలిచి విమర్శలకు సమాధానం చెప్పాలని భావిస్తున్నాడు. ముఖ్యంగా అల్కరాజ్‌పై విజయం సాధిస్తే తనకు మరింత గుర్తింపు లభిస్తుందని ఆశిస్తున్నాడు.

షెల్టన్ నుంచి గట్టి పోటీ

అమెరికా ఆటగాడు బెన్ షెల్టన్ కూడా సీజన్ చివర్లో మంచి ఫామ్‌లో ఉన్నాడు. యూఎస్ ఓపెన్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌కు చేరిన అతడు.. క్వార్టర్ ఫైనల్లో అల్కరాజ్‌ను ఓడించాడు. ఆ మ్యాచ్ తెల్లవారుజామున 3.33 గంటలకు ముగిసింది. పారిస్ మాస్టర్స్ ఫైనల్లో అల్కరాజ్ చేతిలో ఓడినా గట్టి పోటీనిచ్చాడు. ఇటీవల అల్కరాజ్ మాజీ కోచ్ జువాన్ కార్లోస్ ఫెరెరోను తన సహాయక బృందంలో చేర్చుకోవడం విశేషం. ఈ సీజన్‌లో అత్యుత్తమంగా నిలిచిన ఎనిమిది మంది ఆటగాళ్లు తలపడే ఏటీపీ ఫైనల్స్ ఆదివారం టురిన్‌లో ప్రారంభం కానున్నాయి. గత రెండేళ్ల విజేత జానిక్ సినర్ కుడి మోకాలి గాయం కారణంగా ఈసారి టోర్నీకి దూరమయ్యాడు.

గ్రూపుల వివరాలు: **జాన్ మెక్రో గ్రూప్:** అలెగ్జాండర్ జ్వెరెవ్ (1), బెన్ షెల్టన్ (3), ఆర్థర్ ఫిల్స్ (6), రఫేల్ జోడార్ (8).
ఇవాన్ లెండిల్ గ్రూప్: కార్లోస్ అల్కరాజ్ (2), డానిల్ మెద్వెదేవ్ (4), ఫ్లావియో కొబొల్లి (5), ఫ్రాన్సిస్ టియాఫో (7).





ముద్దుగున్నది నేనేనా.. రుత్తూ..

కుటుంబమంతా కలిసి చూసే ఒక సినిమా చూస్తే బాగుంటుందనిపించి 'రియాలిటీ' కథ రాశానని అన్నారు కిరణ్ అబ్బవరం. ఆయన స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. దేవిక కథానాయిక. జాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై సుధాకర్ చాగంటి, సురేష్ యెర్రా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ మూవీకి సంబంధించి 'రుత్తూ..' అంటూ సాగే పాటను చిత్ర బృందం విడుదల చేసింది. బీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చిన ఈ పాటకు పూర్ణాచారి సాహిత్యం అందించారు. కపిల్ కపిలన్ ఆలపించారు. డిసెంబరు 25న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది.



డిసెంబరు 18న ఆల్కహాల్

హాస్య నటుడు అల్లరి నరేశ్ మరోసారి నవ్వులు పంచేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ కామెడీ చిత్రం 'ఆల్కహాల్' డిసెంబరు 18న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ గురువారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. గతేడాది విడుదలైన టీజర్ సినిమాపై ఆసక్తి పెంచింది. ఇందులో మద్యానికి దూరంగా ఉండే వ్యక్తిగా నరేశ్ కనిపించనున్నారు. ఆయన, సత్య మధ్య సాగిన సంభాషణలు నవ్వులు పూయించాయి. మద్యం తాగకపోవడానికి తనపై తనకు నియంత్రణ ఉండాలనే కారణాన్ని నరేశ్ చెప్పే తీరు టీజర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మెహర్ తేజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రుహానీ శర్మ, నిహారిక ఎన్ఎం, సత్య కీలక పాత్రలు పోషిస్తున్నారు. గిబ్రాన్ సంగీతం, చైతన్ భరద్వాజ్ నేపథ్య సంగీతం అందిస్తున్నారు. జిజు సన్నీ ఛాయాగ్రహణం, నిరంజన్ దేవరమనే ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై నిర్మిస్తుండగా.. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. ఇందులో గిరీశ్ కులకర్ణి, హర్షవర్ధన్, చైతన్య కృష్ణ, రవీంద్ర విజయ్, రఘుబాబు తదితరులు నటిస్తున్నారు.

అయ్యప్ప దయతో మాకేం కాలేదు




తాను ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురి కావడంపై కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ స్పందించారు. తాను క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన వీడియో విడుదల చేశారు. 'నిన్న రాత్రి ఓ పాట చిత్రీకరణ కోసం వెళ్లాం. తెల్లవారుజామున సుమారు 5 గంటల సమయంలో షూట్ పూర్తి చేసుకొని ఇంటికి వెళ్తున్న క్రమంలో మా కారు ప్రమాదానికి గురైంది. దీంతో కారు తీవ్రంగా దెబ్బతింది. ప్రమాద సమయంలో వాహనంలో నలుగురం ఉన్నాం. అయ్యప్పస్వామి దయ వల్ల మాకెవ్వరికీ ఏం కాలేదు. మళ్లీ షూటింగ్‌కి వెళ్తున్నాం' అని శేఖర్ మాస్టర్ వెల్లడించారు.



మొబైల్ టారిఫ్‌లు పెంచాల్సిందే


- ఏఆర్‌పీయూ రూ.350కు చేరాలి
- టవర్ల సంఖ్య రెట్టింపు చేయాలి
- మూడు బలమైన సంస్థలే ఉండాలి
- ఎయిర్‌టెల్ చైర్మన్ మిట్టల్ సూచన



న్యూఢిల్లీ: దేశంలో మొబైల్ టారిఫ్‌లు పెంచాల్సిన అవసరం ఉందని భారతీ ఎయిర్‌టెల్ వ్యవస్థాపకుడు, చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్ అన్నారు. ఒక్కో వినియోగదారుడి నుంచి నెలకు సగటున రూ.350 ఆదాయం (ఏఆర్‌పీయూ) రావాలని, రోజుకు రూ.10–12 ఖర్చు పెద్ద భారం కాదని పేర్కొన్నారు. భారతీ ఎంటర్‌ప్రైజెస్ 50వ వార్షికోత్సవం సందర్భంగా పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ అభిప్రాయాలు వెల్లడించారు. ద్రవ్యోల్బణం, విద్యుత్, చమురు ధరలు, వేతనాలు, నిర్వహణ వ్యయాలు పెరగడంతో టారిఫ్‌లు పెరగాలన్నారు. చైనాలో 10 లక్షలకు పైగా మొబైల్ టవర్లు ఉండగా, భారత్‌లో 3.50 లక్షలే ఉన్నాయని, వాటిని రెట్టింపు చేయడంతో పాటు ఫైబర్, సముద్రగర్భ కేబుళ్ల నెట్‌వర్క్‌ను విస్తరించాలని సూచించారు. 5జీ స్పెక్ట్రమ్, నెట్‌వర్క్ నిర్మాణంపై భారీగా పెట్టుబడులు పెట్టినా ఆశించిన ఆదాయం రాలేదన్నారు. యూపీఐ, బ్యాంకింగ్, ఆరోగ్యం, ఈ–కామర్స్ వంటి సేవలకు టెలికాం నెట్‌వర్క్‌లే ఆధారమని, అయినా సంస్థలకు తగిన లాభాలు రావడం లేదని వ్యాఖ్యానించారు.

భారత్‌లోనే చౌక టారిఫ్‌లు

ప్రపంచంతో పోలిస్తే రూ.350 ఏఆర్‌పీయూ వచ్చినా భారత్‌లో టారిఫ్‌లు చౌకగానే ఉంటాయని చెప్పారు. సెప్టెంబరు త్రైమాసికంలో ఎయిర్‌టెల్ ఏఆర్‌పీయూ రూ.271గా నమోదైంది. గతేడాది ఇది రూ.256. చివరిసారిగా 2024 జూన్‌లో టారిఫ్‌లు 10–25 శాతం పెరిగాయి. దేశంలో మూడు బలమైన ప్రైవేటు టెలికాం సంస్థలే ఉండాలని మిట్టల్ అభిప్రాయపడ్డారు. వొడాఫోన్ ఐడియా, బీఎస్ఎన్ఎల్ సవాళ్లు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. టారిఫ్‌ల పెంపు ఎయిర్‌టెల్, జియోకు ఆదాయం పెంచే అవకాశం ఉండగా, వొడాఫోన్ ఐడియాకు కీలకం కానుంది. అయితే ఛార్జీలు పెరిగితే వినియోగదారులు నెట్‌వర్క్‌లు మారే అవకాశముంది.



వొడాఫోన్ ఐడియా నష్టం రూ.5,975 కోట్లు

- గతేడాదితో పోలిస్తే పెద్ద మొత్తంలో నష్టపోయిన సంస్థ

న్యూఢిల్లీ: ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వొడాఫోన్ ఐడియాకు నష్టాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై–సెప్టెంబరు త్రైమాసికంలో (క్యూ2) సంస్థ రూ.5,975 కోట్ల ఏకీకృత నికర నష్టాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.5,524 కోట్లతో పోలిస్తే నష్టం పెరిగింది. ట్రెజరీ ఆస్తుల విలువను తిరిగి మదింపు చేయడం, రూ.462 కోట్ల అసాధారణ నష్టం ఇందుకు కారణమయ్యాయి. కార్యకలాపాల ఆదాయం మాత్రం 6.2 శాతం పెరిగి రూ.11,884 కోట్లకు చేరింది. అసాధారణ నష్టాన్ని మినహాయిస్తే క్యూ2లో నష్టం రూ.5,513 కోట్లుగా ఉంది. గత ఏడాది ఇదే కాలంలో ఇది రూ.5,562 కోట్లుగా నమోదైంది. సెప్టెంబరు చివరికి సంస్థ వినియోగదారుల సంఖ్య 19.44 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే సమయంలో 19.67 కోట్లుగా ఉంది. ఒక్కో వినియోగదారుడిపై సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) 10 శాతం పెరిగి రూ.198కి చేరగా, 4జీ, 5జీ వినియోగదారుల సంఖ్య 13.10 కోట్లకు పెరిగింది. నెట్‌వర్క్ విస్తరణ కోసం క్యూ2లో రూ.3,946 కోట్ల మూలధన వ్యయం చేసింది. రూ.13,200 కోట్లకు పైగా పెట్టుబడి ఆర్డర్లు ఇవ్వగా, సుమారు రూ.6,000 కోట్ల పనులు పూర్తయ్యాయని సీఈఓ అభిజిత్ కిశోర్ తెలిపారు. 2027 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో వారెంట్లు, బ్యాంకు రుణాలు, ఇతర సదుపాయాల ద్వారా రూ.10,500 కోట్లకు పైగా నిధులు సమీకరించినట్లు సంస్థ వెల్లడించింది. రెండో త్రైమాసికంలోనే రూ.4,000 కోట్లకు పైగా అదనపు బ్యాంకు నిధులు సమకూర్చుకుంది. మరిన్ని పెట్టుబడులతో నెట్‌వర్క్ విస్తరణ కొనసాగిస్తామని యాజమాన్యం తెలిపింది.

అవెండస్ క్యాపిటల్‌లో నీలేశ్ ధేడీకి కీలక బాధ్యతలు

- ప్రైవేట్ క్రెడిట్ విభాగం ఎండీగా నియామకం



ముంబై: ఆర్థిక సేవల సంస్థ అవెండస్ క్యాపిటల్ ప్రైవేట్ క్రెడిట్ విభాగం మేనేజింగ్ డైరెక్టర్, అధిపతిగా నీలేశ్ ధేడీని నియమించింది. ఈ విభాగం ఇప్పటివరకు 100 లావాదేవీలు నిర్వహించగా, వాటి మొత్తం విలువ రూ.20 వేల కోట్లకు పైగా ఉంది. దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ క్రెడిట్ వేదికల్లో ఒకటిగా ఈ వ్యాపారాన్ని తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంస్థ సహ వ్యవస్థాపకుడు కౌశల్ అగర్వాల్ తెలిపారు. మరోవైపు, సంస్థకు చెందిన నాన్ బ్యాంకింగ్ రుణ విభాగం అవెండస్ ఫైనాన్స్ సీఈఓగా షుజా సిద్దిఖీని నియమించినట్లు వెల్లడించింది. షేర్లపై రుణాలు అందించడంలో ఈ సంస్థ ప్రత్యేకంగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

ఆదిత్య బిర్లా క్యాపిటల్ బంగారు రుణాల విస్తరణ

- ముంబైలో మరో రెండు గోల్డ్ లోన్ శాఖలు ప్రారంభం



ముంబై: బంగారంపై రుణాలు తీసుకునే వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఆదిత్య బిర్లా క్యాపిటల్ తన వ్యాపారాన్ని విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ముంబైలో గురువారం మరో రెండు గోల్డ్ లోన్ శాఖలను ప్రారంభించింది. దీంతో ఈ విభాగంలోని శాఖల సంఖ్య 100 దాటింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ విశాఖ ముల్యే ఈ రెండు శాఖలను ప్రారంభించారు. 100 శాఖల మైలురాయి సంస్థ అమలు సామర్థ్యానికి, వినియోగదారుల నమ్మకానికి నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ఈ ఏడాది ఆగస్టులో బంగారు రుణాల వ్యాపారంలోకి ప్రవేశించిన సంస్థ.. రానున్న మూడేళ్లలో శాఖల సంఖ్యను 1,000కు పైగా పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది.

మూడోరోజూ లాభాలే

- 32 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్.. 25,299 వద్ద ముగిసిన నిఫ్టీ

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగిశాయి. విదేశీ పెట్టుబడుల ప్రవాహం, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరల తగ్గుదల సూచీలకు అండగా నిలిచాయి. అయితే ఐటీ, ఎఫ్ఎంసీజీ, ఆటో షేర్లలో మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో సూచీల జోరు పరిమితమైంది. గురువారం బీఎస్ఈ సెన్సెక్స్ 31.61 పాయింట్లు పెరిగి 81,911.01 వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 44.30 పాయింట్లు లాభపడి 25,299.35 వద్ద స్థిరపడ్డాయి. రియల్టీ రంగం అత్యధికంగా 4.79 శాతం పుంజుకోగా, బీమా 2.90 శాతం, ప్రభుత్వ బ్యాంకులు 1.40 శాతం, ఆర్థిక సేవలు 1.31 శాతం లాభపడ్డాయి. మిడ్‌క్యాప్ 1.25 శాతం, స్మాల్‌క్యాప్ 1.09 శాతం పెరిగాయి. మరోవైపు ఆటో, చమురు–గ్యాస్, టెలికాం రంగాలు నష్టపోయాయి.

సెన్సెక్స్‌లో బజాజ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ, బీఈఎల్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు రాణించగా.. హెచ్‌యూఎల్, మారుతీ, పవర్‌గ్రిడ్, టీసీఎస్ నష్టపోయాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు బుధవారం ఒక్కరోజే రూ.12,563 కోట్ల విలువైన షేర్లు కొనుగోలు చేశారు. నవంబరులో ఇప్పటివరకు ఎఫ్‌పీఐ పెట్టుబడులు 6.43 బిలియన్ డాలర్లకు చేరాయి. బ్రెంట్ ముడిచమురు ధర 0.44 శాతం తగ్గి బ్యారెల్‌కు 92.50 డాలర్లుగా నమోదైంది. రియల్టీ, ఆర్థిక రంగాల్లో కొనుగోళ్లు మార్కెట్‌కు మద్దతిచ్చాయని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ పరిశోధన విభాగాధిపతి వినోద్ నాయర్ తెలిపారు. అంతర్జాతీయ టెక్నాలజీ షేర్లలో అస్థిరత, అమెరికాలో అధిక ద్రవ్యోల్బణం మార్కెట్లపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు.



Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.